## టీవీకేలో కోటికి చేరిన సభ్యత్వాలు

చెన్నై: విక్రవాండిలో తమిళగ వెట్రి కళగం(టీవీకే) తొలి మహానాడు విజయవంతంగా ముగిసి నెల రోజులు కూడా పూర్తి కాకముందే ఆ పార్టీలో సభ్యత్వం ఊపందుకుంది. నిర్వాహకుల అంచనాలను పటాపంచలు చేస్తూ సభ్యత్వం కోటికి చేరుకుంది. 2026 అసెంబ్లీ ఎన్నికలపై దృష్టిసారిస్తూ టీవీకే నేత విజయ్ తొలిమహానాడును విక్రవాండిలో నిర్వహించి పార్టీ సిద్ధాంతాలను ప్రకటించారు. అక్టోబరు 27న మహానాడు జరిగే సమయానికి ఆ పార్టీలో సుమా రు 75 లక్షలకు పైగా సభ్యత్వాలున్నాయి. మహానాడు ఏర్పాట్ల కారణంగా సభ్యత్వ నమోదును కొన్ని రోజులపాటు ఆపారు. మహానాడు ముగిసిన కొద్ది రోజుల తర్వాత మళ్ళీ ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించగా ఆ పార్టీ నేతలు కూడా ఊహించని విధంగా లక్షల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 296 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 నవంబర్ 2024 ఆదివారం పేజీలు : 4



## మళ్లీ అమెరికాకు సీఎం రేవంత్ రెడ్డి..షెడ్యూల్ ఖరారు !

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అమెరికా టూర్ ఖరారు అయిందట. మళ్లీ అమెరికాకు సీఎం రేవంత్ రెడ్డి పయనం కానున్నారట. జనవరిలో యూఎస్ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పయనం కానున్నారని సమాచారం అందుతోంది. ఐదు నెలల కిందటే అమెరికాకు వెళ్లి వచ్చిన రేవంత్ రెడ్డి.. జనవరిలో యూఎస్ పర్యటనకు సిద్ధం అవుతున్నారట. పెట్టుబడుల కోసం మరోసారి యూఎస్ వెళ్తారని సమాచారం అందుతోంది.

దీంతో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక నేడు మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి పయనం కానున్నారు. ఇవాళ, రేపు.. రెండు రోజుల పాటు మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి. ఇవాళ ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు నాగ్‌పూర్‌కు చేరుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి.

అక్కణ్నుంచి చంద్రాపూర్‌లో అక్కడి నేతలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

## న్యాయం అడిగితే.. దాడులు చేస్తారా?: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ఐఐఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ఐఐఐటీ విద్యార్థిని స్వాతిప్రియ కుటుంబానికి న్యాయం చేయాలని అడిగితే విచక్షణ రహితంగా దాడి చేయిస్తారా? అని ప్రశ్నించారు. బాసర ఐఐఐటీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. "విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు.

విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం హేయమైన చర్య. బాసర ఐఐఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. అరెస్టు చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలి. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం స్వాతిప్రియ అనే విద్యార్థిని బాసర ఐఐఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇవాళ ఆందోళన చేపట్టారు.




# రేషన్ కార్డుదారులకు...

# సర్కార్ బంపర్ ఆఫర్!

## మార్పు... చేర్పులకు అవకాశం కల్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : గత ఏడాది తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ బీఆర్ఎస్ ని ఓడించి కాంగ్రెస్ దిగ్విజయం సాధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. సీఎం గా రేవంత్ రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టారు.నాటి నుంచి ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటూ దూకుడు కొనసాగిస్తున్నారు. ప్రతిపక్ష నేతల సవాళ్లకు ధీటుగా సమాధానమిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేశారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశారు. తాజాగా రేషన్ కార్డుదారులకు తెలంగాణ సర్కార్ తీపి కబురు అందించింది. వివరాల్లోకి వెళితే.. కుటుంబాల నుంచి వేరు పడినవారు, పెళ్లిళ్లు చేసుకున్న తర్వాత పిల్లలు కలిగిన వారు, అత్తవారింటికి వెళ్లిన ఆడపడుచులు కొత్త రేషన్ కార్డుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే రేషన్ కార్డులో కుటుంబ సభ్యులను ఇతర వివరాలను నమోదు చేసే అవకాశం కల్పిస్తుంది. అంతేకాదు రేషన్ కార్డులో ఏవైనా మార్పులు చేర్పులు సైతం చేసుకోవచ్చని తెలిపింది. ఇందుకోసం మీసేవ సెంటర్ల వద్దకు వెళ్లి కావాల్సిన ధృవపత్రాలు అందించాలి. మీసేవ సెంటర్ లో మీ కుటుంబ సభ్యుల పేరుని నమోదు చేసి వారికి సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అంటే ఆధార్ కార్డులు, పిల్లల జనన ధృవీకరణ పత్రాలు, భార్యపేరు నమోదు చేయాల్సి వస్తే మ్యారేజ్ సర్టిఫికెట్ ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాలి. పూర్తి వివరాలు అందించిన తర్వాత మీసేవ సెంటర్లలో నామమాత్రపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత అధికారిక వెబ్ సైట్ లో మీ రేషన్ కార్డు ఆన్ లైన్ స్టేటస్ ను చెక్ చేసుకోవచ్చు. ఇటీవల ప్రజాపాలనలో భాగంగా రేషన్ కార్డుల కోసం లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

త్వరలో కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని రేవంత్ సర్కార్ చెబుతోంది. ఇదిలా ఉంటే..ఇటీవల తెలంగాణ రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్ చెప్పారు మంత్రి తుమ్మల నాగేశ్వరావు.జనవరి నుంచి రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించారు. గురుకులాలకు, సంక్షేమ పాఠశాలలకు సన్న బియ్యం ఇస్తామని వెల్లడించారు. దశాబ్దాలుగా భారతదేశ సాంఘిక సంక్షేమ వ్యవస్థలో రేషన్ కార్డులు అంతర్భాగంగా ఉన్నాయి.ఆహార భద్రత, జనాభాలో నిత్యావసర వస్తువుల సమాన పంపిణీని నిర్ధారించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వర్గంలో ఉన్న వారికి రేషన్ కార్డ్ మంజూరు చేయబడతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి వంటి అనేక అంశాలపై దృష్టిసారిస్తుందని అన్నారు. మొత్తానికి ఎప్పటి నుంచో తమ కుటుంబ సభ్యులు పేర్లు నమోదు చేసుకోవాలని ఎదురు చూస్తున్న వారికి ఇది బంపర్ ఆఫర్ అని అంటున్నారు. ప్రస్తుత రేషన్ కార్డులను వీలైనంత త్వరగా సరిచేసుకోవాలని ప్రభుత్వం కోరింది.

# అవునా.. నిజమా...!?

# కేసీఆర్‌కు అర్జంటుగా కేటీఆర్ అరెస్ట్ కావాలా..!



## రాజకీయ వర్గాల్లో ఒకటే చర్చ!!

హైదరాబాద్ : పదేళ్లు అధికారంలో ఉండి.. ఒక్కసారిగా అధికారాన్ని కోల్పోవడాన్ని బీఆర్ఎస్ తట్టుకోలేకపోతున్నదా..? అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన పది రోజుల నుంచే కేసీఆర్, కేటీఆర్ ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు.. ఎప్పుడైనా కూలిపోవచ్చు.. అని కామెంట్స్ చేస్తున్నారా..? 11 నెలలైనా ప్రభుత్వం ఢోకా లేకుండా కొనసాగుతుండడాన్ని వీరు తట్టుకోలేకపోతున్నారా..? అందుకే వారిలో రోజురోజుకూ ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతున్నదా..? అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా గూండా రాజకీయాలకు తెరలేపారా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. స్వయానా కేసీఆర్, కేటీఆర్ వైఖరిపై సొంత పార్టీ బీఆర్ఎస్ నేతల నుంచే ఈ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారు. కానీ.. ఆయన అక్కడి నుంచే రాజకీయాలు నడుపుతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన డైరెక్షన్‌లోనే కేటీఆర్, హరీశ్ రావులు కాంగ్రెస్‌ను కార్నర్ చేస్తున్నారనడంలోనూ ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు నుంచే ప్రభుత్వాన్ని కూల్చేందుకు అవసరమైన కత్తులు నూరుతున్నారన్న కామెంట్స్ ఆ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. అందుకే.. ఎప్పుడు ఏ ఛాన్స్ దొరుకుతుందా అని కాచుకు కూర్చున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఒక్కో హామీని నెరవేరుస్తూ వస్తున్నది. కానీ.. బీఆర్ఎస్ మాత్రం నిత్యం ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు మోకాలడ్డుతూనే ఉన్నది. ఇక ఇటీవల రైతు రుణమాఫీ సందర్భంలోనూ అలాంటి రాజకీయాలనే నెరిపింది. కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలైన రైతులను పట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు దిగింది. ఆ కార్యక్రమాలు కూడా పెద్దగా బీఆర్ఎస్‌కు మైలేజీ తీసుకురాలేదు. ఇక.. మూసీ సుందరీకరణ అంశంలోనూ కాంగ్రెస్‌ను ఇబ్బందులు పెట్టే ప్రయత్నమే చేసింది. కేటీఆర్, హరీశ్ ఇద్దరూ పెద్ద ఎత్తున ప్రభుత్వంపై అటాక్ చేశారు. కానీ.. చివరకు మూసీ సుందరీకరణ అంశాన్ని బీఆర్ఎస్ హయాంలోనే తీసుకొచ్చారనేది రేవంత్ రెడ్డి ప్రభుత్వం బయటపెట్టింది. దాంతో ఆ అంశంలోనూ బీఆర్ఎస్ ఫెయిల్ అయింది. హైడ్రా విషయంలోనూ పలువురు బాధితులను పట్టుకొని రాజకీయం చేయాలని చూశారు. బాధితులను బీఆర్ఎస్ భవన్‌కు సైతం పిలుచుకున్నారు. పెద్ద ఎత్తున ఆందోళనలకు, నిరసనలకు ప్లాన్ చేశారు. చివరకు బాధితుల ఇళ్లకు సైతం వెళ్లి వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నం చేశారు. అయితే.. తాము ఇంతవరకు పేదల ఇళ్లను కూల్చలేదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. హైడ్రా కమిషనర్ కూడా నివేదికను వెల్లడించారు. కేవలం ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న కట్టడాలను మాత్రమే నేలమట్టం చేసినట్లు వెల్లడించారు. సో... హైడ్రా విషయంలోనూ బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలిందనే ప్రచారం ఉంది. ఇక... ఇటీవల అధికారులను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు కొత్త ప్లాన్ చేశారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మా కంపెనీకి భూ సేకరణ నిమిత్తం పూనుకున్నారు. అయితే.. ఇదే విషయమై భూ సేకరణ కోసం బాధితులకు మాట్లాడేందుకు వెళ్లారు. లగచర్ల గ్రామానికి చేరుకున్న అధికారులను ప్రజలు అడ్డుకున్నారు. అంతేకాదు.. వారి మీద దాడికి యత్నించారు. వారి వాహనాలను ధ్వంసం చేశారు. నానా హంగామా సృష్టించారు. ఏకంగా కలెక్టర్ మీదనే దాడికి యత్నించడమే కాకుండా మిగితా అధికారులనూ హత్యాయత్నానికి ప్రయత్నించారని ప్రభుత్వం పెద్దలు అంటున్నారు. ఈ ఘటనను ప్రభుత్వం కూడా సీరియస్ తీసుకుంది. ఇప్పటికే ఈ కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. దాడిలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సురేశ్ అనే వ్యక్తి బీఆర్ఎస్ కార్యకర్త కావడం.. అతనితో నరేందర్ రెడ్డి 82 సార్లు ఫోన్‌లో మాట్లాడడం పోలీసు విచారణలో వెల్లడైంది. మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరుచగా అతనిని రిమాండ్ చేశారు. అయితే.. పోలీసుల రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరును సైతం జత చేశారు. కేటీఆర్ ఆదేశాల మేరకే ఇదంతా చేసినట్లుగా వారు రిపోర్టు ఇచ్చారు. ఇప్పటికే ఫార్ములా ఈ-కారు రేసు కేసు విచారణ జరుగుతోంది. రూ.55 కోట్లను ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే విదేశాలకు తరలించడంపై ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. గత ప్రభుత్వం మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే ఆ డబ్బులను రిలీజ్ చేశారు. దాంతో ఆ కేసు కేటీఆర్ మెడకు చుట్టుకోబోతోందన్న ప్రచారం ఊపందుకుంది. 'ఇక అప్పటి నుంచి దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి..' అంటూ కేటీఆర్ ప్రభుత్వానికి సవాల్ చేస్తూనే ఉన్నారు. తాజాగా.. అధికారులపై దాడి విషయంలోనూ కేటీఆర్ పేరు తెరమీదకు వచ్చింది. సో.. ఈ కేసులో కూడా కేటీఆర్ అరెస్ట్ తప్పదంటూ ప్రచారం మరింత జోరందుకుంది. ఈ క్రమంలో రెండు రోజులుగా దమ్ముంటే అరెస్ట్ చేయండి.. బయటకు వచ్చాక తాను ఏం చేయాలో అది చేస్తా అంటూ సవాల్ చేశారు. అంతేకాదు రెండురోజుల క్రితం బుధవారం రాత్రి పోలీసుల నుంచి అరెస్ట్ సమాచారం ఏం లేకపోయినప్పటికీ.. కేటీఆర్ నానా హంగామా చేశారు. అరెస్ట్ చేస్తున్నారని బయటకు లీకులు ఇవ్వడంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు నందినగర్‌లోని ఆయన ఇంటికి చేరుకున్నారు. ఇక అప్పటి నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా నేతలతో కేటీఆర్ భేటీ అవుతూనే ఉన్నారు. అయితే.. ఇదంతా కూడా కేసీఆర్ డైరెక్షన్‌లోనూ జరుగుతున్నట్లు పార్టీలో ప్రచారం వినిపిస్తున్నది. ఉమ్మడి జిల్లాల వారీగా మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. ఒకవేళ తనను అరెస్ట్ చేస్తే చేపట్టాల్సిన నిరసనలపై దిశ దశ చేశారు. ఉద్యమం కాలంలో ఏ విధంగా అయితే ఆందోళనలు చేశామో.. అంతకుమించి మండలాలు, నియోజకవర్గాల వారీగా నిరసనలు తెలపాలని సూచించారు. ఎక్కడ కూడా తగ్గకుండా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్లాన్ చేశారు. ఇదిలా ఉండగా.. గత 11 నెలలుగా కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితం అయ్యారు. దాంతో ఆయన ఇప్పటివరకు బయటకు రావడం లేదు. అయితే.. వచ్చే జనవరిలో ఆయన ప్రజాక్షేత్రంలోకి రావాలని ప్లాన్ చేసినట్లుగా ప్రచారం జరుగుతున్నది. కొత్త ప్రభుత్వానికి కావాల్సినంత సమయం ఇచ్చేందుకే కేసీఆర్ ఇన్ని రోజులు ప్రజల్లోకి రాలేదని పార్టీ చెప్పుకొచ్చారు. ఇక ఇప్పుడు కాంగ్రెస్ కూడా కొలువుదీరి ఏడాది పూర్తికానుండడంతో ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీసేందుకు కేసీఆర్ వస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అది చేయలేదు.. ఇది చేయలేదు అని నిలదీసేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే.. కేసీఆర్ ఈ సందర్భంలో ప్రజల్లోకి వచ్చినా ఆయనను పెద్దగా నమ్ముతారా అనేది అనుమానాలు కలుగుతున్నాయి. ఆ వాతావరణం కూడా ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. అందుకే ఓ బలమైన సెంటిమెంట్ కోసం కేసీఆర్ చూస్తున్నట్లుగా తెలుస్తున్నది. అందులో భాగంగానే కేటీఆర్ ఎప్పుడెప్పుడు అరెస్ట్ అవుతారా అని ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు సమాచారం. అందుకే అధికారులపై దాడులకు ఉసిగొలిపారన్న ప్రచారం ఉంది. అంతేకాదు కేటీఆర్ కూడా తనను అరెస్ట్ చేసేందుకు నిత్యం రేవంత్ రెడ్డిని రెచ్చగొడుతూనే ఉన్నారు. అటు ఇంటర్వ్యూలలోనూ ఏం చేస్తారో చేసుకోండి.. అరెస్ట్ చేస్తారో చేసుకోండి.. ఏం కేసు పెడుతారో పెట్టుకోండి.. అంటూ సవాళ్లు చేస్తూనే ఉన్నారు. మరోవైపు.. కలెక్టర్‌పై దాడికి పంపించి ఆ కేసులోనైనా తనను అరెస్ట్ చేస్తారేమోనని చూస్తున్నారు. కేటీఆర్ అరెస్టును వాడుకొని కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి మరోసారి సెంటిమెంటును బలంగా తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాల వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే కవితను అరెస్ట్ చేసి ఆరు నెలలపాటు జైలులో పెట్టారు. ఆ అంశాన్ని, ఇటు కేటీఆర్ అరెస్టును బలంగా వాడుకొని ప్రజల్లో సెంటిమెంట్ తీసుకురావాలని కేసీఆర్ ఆలోచన అన్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

# సంపాదకీయం

## ఇరాన్ రాయబారితో మస్క్ కు పనేంటి..?
## రహస్య భేటీ మాటేంటి?

రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందడంతో అపర కుబేరుడు, స్పేస్ ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ హవా నడుస్తోంది. అది ఎంతగా అంటే.. మస్క్ కు అత్యంత కీలక బాధ్యతలు అప్పగించేంత.. ట్రంప్ ఎన్నికల ప్రచారానికి రూ.400 కోట్లకు పైగా విరాళం ఇచ్చిన మస్క్.. ఆయనకు నేరుగానూ మద్దతు పలికారు. ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతో టెస్లా షేర్ల విలువ పెరిగింది. రూ.2 లక్షల కోట్ల వరకు మస్క్ సంపదకు జత చేరాయి. ఇదంతా పక్కనపెడితే.. ట్రంప్ తన కార్యవర్గంలో మస్క్ కూ చోటివ్వడం ఖాయమైంది.

**భారతీయుడితో పాటు..** వచ్చే జనవరిలో రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న ట్రంప్.. కొత్త కార్యవర్గంలో ఎలాన్ మస్క్ కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) విభాగం బాధ్యతలు అప్పగించారు. 38 ఏళ్ల ప్రవాస భారతీయుడు వివేక్ రామస్వామితో పాటు సంయుక్త సారథిగా నియమించారు. మరోవైపు ఎన్నికల్లో గెలిచాక ట్రంప్ పలువురు దేశాధినేతలకు ఫోన్ చేశారు. ఆ సమయంలో మస్క్ ఆయన పక్కనే ఉన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ తో పాటు మస్క్ మాట్లాడినట్లుగా వార్తలు వచ్చాయి.

**ఇరాన్ రాయబారిని కలిశారా? :** హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం మధ్యలో హిజ్బుల్లా, ఇరాన్ ప్రమేయంతో పశ్చిమాసియా పుండులా రగులుతోంది. ఇజ్రాయెల్ గనుక ఇరాన్ అణు స్థావరాలపై దాడి చేస్తే పరిస్థితి తీవ్రంగా మారనుంది. ఇజ్రాయెల్ ను ఇప్పటికే అమెరికా శాంతింపజేస్తోంది. మరోవైపు ఇరాన్ ను హెచ్చరిస్తోంది. ఇలాంటి సమయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐక్యరాజ్య సమితిలో టెహ్రాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానితో మస్క్ భేటీ అయ్యారు. వీరిద్దరూ రహస్య ప్రదేశంలో గంటకు పైగా చర్చలు జరిపారట. అమెరికాతో ఉద్రిక్తతల విషయమే వీరు మాట్లాడినట్లు, సమావేశం విజయవంతంగా ముగిసినట్లు సమాచారం.

**ఆంక్షలు తొలగిస్తారా? :** ఇరాన్ ను అమెరికా బద్ధ శత్రువుగా చూస్తుంది. ఆ దేశంపై ఇప్పటికే పలు ఆంక్షలు విధించింది. తాజాగా ఈ ఆంక్షల తొలగింపుపై మస్క్–ఇరవానీ మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఆంక్షలను తొలగించి తమతో వాణిజ్యం చేయాలని ఇరవానీ కోరారట.

కాగా, ఈ సమావేశంపై ట్రంప్–మస్క్, సమితిలోని ఇరాన్ మిషన్ నుంచి ధ్రువీకరణ లేదు. కాగా, మస్క్–ఇరవానీ భేటీ నిజమే అయితే.. ఇరాన్ తో సంబంధాలను పునరుద్ధరించుకునే ఆలోచన ట్రంప్ నకు ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇజ్రాయెల్ కు అడ్డు :** ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇటీవల ఆదేశాలిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశాన్ని కట్టడి చేయగలిగేది అమెరికానే. అదే సమయంలో ఇరాన్ పట్ల ట్రంప్ సానుకూల వైఖరి చూపడం గమనార్హం.

## కుటుంబ వివరాల సేకరణలో ఎన్యూమరేటర్ల పాత్ర కీలకం
## అందుకే జాగ్రత్తలు తప్పక పాటించాలి : అదనపు కలెక్టర్

### అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి





శామీర్ పేట, (గరుడ వార్త) : కుటుంబ వివరాల సేకరణలో ఎలాంటి పొరపాట్లు దొర్లకొండ జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రం శామీర్ పేటలో ఎన్యూమరేటర్లు నిర్వహింస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి సందర్శించారు. ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి నమోదు చేసిన ప్రొఫార్మాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి జరిపిన సమగ్ర కటుంబ సర్వే వివరాలను ఫారాలలో ఎలా పొందపరుస్తు న్నారని ఆదనపు కలెక్టర్ ఎమ్యాచురేటర్లను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ప్రొఫార్మాల్లో సక్రమం గా నమోదు చేసి ఆ ప్రొఫార్మా ఫారాలను జాగ్రతగా భద్రపర్చాలని ఆయన అధికారులకు, ఎన్యూమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రిగీలు పొందిన విద్యార్థులు విజ్ఞతతో అట్టడుగు వర్గాల వారికి తోడ్పాటునందించాలి : హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి






శామీర్ పేట, (గరుడ వార్త) : విశ్వవిద్యాలయాల్లో పట్టాలు పొందిన విద్యార్థులు విజ్ఞతతో అట్టడుగు వర్గాల ప్రజా ప్రయోజనాల కోసం కృషి చేయాలని నల్సార్ ఛాన్సర్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే ఆకాంక్షించారు. శామీర్ పేట లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టేన్స్ ఎడ్యుకేషన్, నల్సార్ ఓపెన్ అండ్ డిస్టేన్స్ లర్నింగ్. అడ్వాన్స్డ్ డిప్లొమా ఇన్ లా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం వైస్ చాన్సర్ క్రిష్ణదేవరావు ఆధ్వర్యంలో ప్రత్యేక స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్అలోక్ ఆరాదే విచ్చేసి గ్రాడ్యుయేట్లకు పట్టాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి ఆయన ప్రసంగిస్తు అట్టడుగు వర్గాలకు సమాజిక న్యాయంపై ప్రత్యేక దృష్టి సారించి రాజ్యాంగవాదం, చట్టబద్దత, న్యాయాన్ని నొక్కి చెప్పె నాణ్యమైన విద్యను అందించడంలో నల్సార్ ఎంతోగానో కృషి చేస్తోందన్నారు. నల్సార్ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. 1989 నూతన విద్యా విధానం కాలం నుంచి దూరవిద్య క్రమంగా పెరుగుతోందని, ఈ రంగంలో నల్సార్ తనదైన పాత్రను పోషిస్తు విద్యార్థులకు నాణ్యమైన దూరవిద్యను అందిస్తోందని ప్రశంసించారు. ట్రూత్ ల్యాబ్స్, ట్యాక్స్ మెన్, ఈబీసీ లర్నింగ్ వంటి నాలెడ్జ్ హబ్లతో నల్సార్ అందిస్తున్న సహకారాన్ని ఆయన ఎంతగానో ప్రశంసించారు. క్రిమినల్, ఫోరెన్సిక్ సైన్సెస్, ట్యాక్సేషన్, కార్పొరేట్ చట్టం, హుమానిటేరియన్ లా లో ఎంఎ వంటి ఆదునిక అవసరాలకు తగిన కోర్సులను విద్యార్థులకు నల్సార్ అందిస్తోందని తెలిపారు. నల్సార్ అందిస్తున్న ఓపెన్ డిస్టెన్స్, లర్నింగ్ కోరుల విద్యలలో విద్యార్థుల నమోదులో దాదాపు 50 శాతం మహిళా విద్యార్థులు ఉన్నారని ప్రత్యేకంగా ప్రస్తావించి వారిని అభినందించారు. నల్సార్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన ఎడ్యుకేషన్ తో తెలుగులో భారత రాజ్యాంగం పై ప్రాథమిక కోర్సును ప్రారంభించడం పట్ల ఆయన ఎంతగానో ప్రశంసించాడు. లా కోర్సుల పట్ల నల్సర్ చేస్తున్న ఎన్నో ప్రయత్నాలు సాకారమవుతున్నాయని, భవిష్యత్లో మరెన్నో సాకారం కావలసి ఉందని ఆయన ఆకాంక్షించారు. నల్సార్ దూరవిద్య పద్ధతిలో పట్టాలు పొందిన డిగ్రీ విద్యార్థులు పొందిన ఉత్తమ ఫలితాలను అందుకు చేసిన ప్రయత్నాల పట్ల ఆయన వారిని అభినందించారు. నల్సార్ వైస్ చాన్సర్ కృష్ణదేవరావు స్వాగతోపాన్యాసం చేస్తు నల్సార్ ఓపెన్ డిస్టెన్స్ డిగ్రీలను పొందేందుకు సాకారం చేసుకోవడం లో పట్టభద్రులు చేస్తున్న కృషిని ప్రశంసించారు.

**డిగ్రీలు, డిప్లొమా కోర్సులను పూర్తి చేసిన 1255 మంది విద్యార్థులు, పట్టాలను పొందిన 287 మంది గ్రాడ్యుయేట్లు....**

నల్సార్ లో నిర్వహించిన ప్రత్యేక స్నాతకోత్సవంలో నల్సార్ ఓపెన్ డిస్టేన్స్, లర్నింగ్, డి ప్లొమా లా కోర్సులు, పీజి డిప్లొమా, ఎంఏ ఏవియేషన్ లా, ఎంఏ సెక్యూరిటి అండ్ డిపెన్స్, ఎంఏ స్పెస్ అండ్ టెలికమ్యూనికేషన్, ఎంఏ మారిటైమ్ లా, ఎంఏ క్రిమినల్ లా, అండ్ ఫోరెన్సిక్ సైన్స్, ఎంఏ జంతు సరంక్షణ చట్టాలు, తదితర లా కోర్సుల్లో 1255 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. వీరిలో 287 మంది విద్యార్థులకు డిగ్రీలు, డిప్లొమా పట్టాలను నల్సార్ చాన్సర్ జస్టిస్ అలోక్ ఆరాదే, వైస్ చాన్సర్ కృష్ణదేవరావులు ప్రధానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో విద్యార్థులు ఎంతో అనందోత్సవాలతో పట్టాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, నల్సార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి



శామీర్ పేట, ( గరుడ వార్త) : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి ఎంపికై రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు సత్తా చాటునట్లుగా ఆ పాఠశాల ప్రిన్సిపల్ ముత్తయ్య, కోచ్ సాయికుమార్లు శనివారం తెలిపారు. ఈనెల 13, 14న 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప గ్రీన్ పార్క్ క్రికెట్ గ్రౌండ్లో జరిగిన అండర్ 17 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో మజీద్ పూర్ శ్రీ చైతన్య స్కూల్లో పదో తరగతి చదువుతున్న కౌశిక్ పాల్గొని ప్రతిభ కనపరచాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన కౌశిక్ రాష్ట్ర స్థాయిలో పాల్గొననున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిట అయిన కౌశిక్ ను పాఠశాల ప్రిన్సిపాల్ ముత్తయ్య, కోచ్ సాయికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## వరి కోతలు షురూ!

ఎల్లారెడ్డిపేట : వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు.

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి.

జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది.

258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమశాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి.

తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా



చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు.

13,552 ఎకరాల్లో సన్నరకం సాగు


జిల్లాలో రైతుబంధు లెక్కల ప్రకారం 1,34,725 మంది రైతులున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటగా వరిని 1,79,672 ఎకరాల్లో సాగు చేశారు. అందులో 13,552 ఎకరాల్లో సన్నరకం, 1,66,123 ఎకరాల్లో దొడ్డు రకాలున్నాయి.

సన్నరకం వరికి రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు కొంతమేర ఊరట లభించనుంది.

సన్న రకాలు ఎకరానికి 18 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావిస్తుండగా, జిల్లాలో మొత్తం దాదాపు 28,457 క్వింటాళు వస్తుందని అంచనా వేశారు.దొడ్డు రకం ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున లెక్కిస్తే సుమారు 4,15,307 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.జిల్లాలోని పలు మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకోగా, కొన్ని మండలాల్లో ఈనే దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కానున్నాయి. ప్రస్తుతం కోతలను ప్రారంభించిన కర్షకులు కొంత మంది అకాల వర్షాల భయంతో ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తుండగా మరికొందరు కొనుగోలు కేంద్రాలకు చేరవేస్తున్నారు.

## తూతూమంత్రం.. ప్రమాదాలకు మార్గం

హైదరాబాద్: గ్రేటర్‌లో ఆటోమేటిక్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గతంలో చౌటుప్పల్ ప్రాంతంలో ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రం పనులు ప్రారంభమైనప్పటికీ వివిధ కారణాలతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం తూతూమంత్రంగా చేస్తున్న ఫిట్‌నెస్‌తో స్కూల్ బస్సులు, ఆటోలు, స్కూల్ వ్యాన్లు, మినీ బస్సులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గ్రేటర్‌లో 3 కమిషరేట్ల పరిధిలో ఏటా 5–6 వేల ప్రమాదాలు



జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రజారవాణాకు సంబంధించి ప్రతి వాహనానికి ఏటా ఆర్టీవో నుంచి ఫిట్‌నెస్ ధ్రువపత్రం తీసుకోవాలి. కొన్నిసార్లు అధికారులకు కొంత ముట్టజెప్పి ఫిట్‌నెస్ లేని వాహనాలకూ ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు కొందరు. ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ ఇక్కడ అందుబాటులోకి తేవడంలో జాప్యం జరుగుతోంది. ఆటోమేటిక్‌తో ఇలా..ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించి 40 అంశాలను ఈ కేంద్రాల్లో పరిశీలించి వాహన సామర్థ్యాన్ని అంచనా వేస్తాయి.టైర్లు, బ్రేకులు, స్టీరింగ్, ఇంజిను సామర్థ్యం, వాహన బాడీ ఇలా ప్రతి అంశాన్ని తనిఖీ చేసి సదరు వాహనం రోడ్లపై తిరిగేందుకు అర్హమైనదా.. కాదా.. గుర్తించి స్కోరు అందిస్తుంది. ఆ స్కోరునుబట్టి ఫిట్‌నెస్ ధ్రువీకరణ జారీ చేస్తారు. ఇందులో మానవ ప్రమేయం లేకపోవడం వల్ల అసలైన వాహన సామర్థ్యం ఏంటో తెలుస్తుంది. ప్రస్తుతం సరైన ఫిట్‌నెస్ లేకుండానే వాహనాలు బయట తిరుగుతున్నాయి. ఈ కేంద్రాలతో ఆ పరిస్థితి ఉండదు.

# పంచాయతీల్లో నిధుల లేమి

కరీంనగర్ : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అనే జాతిపిత మహాత్మాగాంధీ ఆశయం నెరవేరడంలేదు.. పల్లెలు పరిపుష్టమైతే అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతోందనడంలో అతిశయోక్తి లేదు. కానీ ఆ పల్లెలు పాలకుల పట్టింపులేని తనంతో కొన్నేళ్లుగా నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నెలలుగా ట్రాక్టర్ వాయిదాలు, మల్టీపర్పర్స్ కార్మికుల వేతనాలు, గతంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు నిధులు రాక మాజీ సర్పంచులు దైన్యస్థితిలో కాలం వెల్ల దీస్తున్నారు. చివరకు విద్యుత్తు బిల్లులు, నీటి ట్యాంకుల నిర్వహణకు సైతం నిధులు లేక ప్రత్యేక అధికారులు గ్రామాలు వెళ్లటానికి ముఖం చాటేస్తున్నారు. వివిధ అన్ని పద్దుల కింద జిల్లాకు అందాల్సిన బకాయిలు రూ.15.29 కోట్లుగా ఉన్నాయి.

**ప్రత్యేకాధికారుల పాలన..**

సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగిసింది. ఆరు నెలల్లోగా కొత్త పాలకవర్గాలు కొలువుదీరాలి. కానీ తొమ్మిది నెలలవుతున్నా ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. పైపెచ్చు గ్రామాలకు ప్రభుత్వపరంగా అందించాల్సిన ఆర్థిక చేయూత కొరవడింది.

పాలకవర్గాలు ఉంటే కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు అందేవి. వాటితో స్థానిక మౌలిక వసతుల సమస్యలు కొద్దో గొప్పో తీరిపోయేవి. జిల్లాకు సుమారు రూ.6 కోట్లు అందాల్సి ఉంది. అలాగే ఎస్ఎఫ్‌సీ సైతం అందటంలేదు.



పాలకవర్గం పదవీకాలం పూర్తికాగానే జిల్లాలోని 313 పంచాయతీలకు ప్రతి గ్రామానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. కానీ పంచాయతీలకు అందాల్సిన నిధులు సకాలంలో అందకపోవడంతో పల్లెల్లో మౌలిక వసతులపై చేతులెత్తేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో కొద్దో గొప్పో ఇళ్ల పన్ను, ఇంటి అనుమతి నిధులు వంటి వాటితో కార్యదర్శులు పారిశుద్ధ్య నిర్వహణతోపాటు, కార్మికులకు అడపాదడపా జీతాలు చెల్లిస్తున్నారు.

పాలకవర్గాలు ఏర్పడితే గానీ పంచాయతీలు ఎంతోకొంత గాడిన పడవని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ నిధులేమిపై జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్‌ను సంప్రదించగా ఈ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూనే ఉన్నామన్నారు. నిధులు విడుదల కాగానే పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 313

గ్రామాల్లో నివసిస్తున్న జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం) : 6,11,062

పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు : రూ.1,12,92,000

వీధిదీపాలు విద్యుత్తు బిల్లులకు చెల్లించాల్సింది : రూ.75.97 లక్షలు (అక్టోబరు వరకు)

పంచాయతీల ట్రాక్టర్ల బ్యాంకు వాయిదాలు (137 పంచాయతీలు) పెండింగ్ : రూ.47,53,568

గతంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు మాజీ సర్పంచులకు అందాల్సిన నిధులు : రూ.12,86,90,783

# ఆగని ఇసుక దందా

కోరుట్ల: కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వాగుల్లోని ఇసుకను అక్రమ వ్యాపారులు విచ్చల విడిగా తవ్వకాలు చేపట్టి ఇతర జిల్లాలకు, ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మల్లాపూర్ మండలంలోని గోదావరి నది, కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి మండలాల్లో పెద్దవాగులు ఉన్నాయి. వీటిల్లో వానాకాలం వరదలకు పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఏర్పడుతుంటాయి. ఈ ఇసుక మేటలను లక్ష్యంగా చేసుకొని అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కథలాపూర్ మండలంలోని సిరికొండ, తక్కలపల్లి గ్రామ శివారులోని వాగు ఒడ్డునున్న భూ యజమానులు.. వాగు తమ పరిధిలోకి వస్తుందని చెబుతూ ఇసుకను వ్యాపారులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. వాగుల్లోంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి, తర్వాత లారీలు, టిప్పర్‌లలో నింపి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలతో పెద్దఎత్తున గొయ్యిలు ఏర్పడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాద స్థితి ఏర్పడుతోంది. వాగుల్లో, గోదావరి నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఇసుక తవ్వి విక్రయించినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేసే అవకాశాలున్నాయి. నిబంధనలలోపే ఇసుకను తవ్వడంతో భూగర్భజలాలకు ప్రమాదం లేకుండా ఉంటుంది.

**రీచ్‌ల ఏర్పాటులో జాప్యమెందుకో?**

మల్లాపూర్ మండలంలోని గోదావరి నది, సాతారం.. మెట్‌పల్లి మండలంలో ఆత్మకూర్.. కోరుట్ల మండలంలోని పైడిమడుగు.. కథలాపూర్ మండలంలోని సిరికొండ ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు సర్వేలు చేశారు. వాగులో నీటి ప్రవాహం ఉన్నందున ఎంతమేర ఇసుకను తవ్వవచ్చని నీటి పారుదలశాఖ నుంచి అనుమతుల కోసం మైనింగ్‌శాఖ అధికారులు లేఖ రాశారు. నీటిపారుదల నుంచి అనుమతులు వస్తే కలెక్టర్ సూచనల మేరకు మైనింగ్ అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేస్తారు. నిర్దేశించిన ధరల ప్రకారం అవసరమున్న వారు రెవెన్యూశాఖ అనుమతులతో ఇసుకను తీసుకునే వీలుంటుంది. రీచ్‌ల ఏర్పాటుతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రెవెన్యూ, మైనింగ్, నీటి పారుదల శాఖల మధ్య సమన్వయ లోపంతో రీచ్‌ల ఏర్పాటులో జాప్యం జరుగుతుండగా.. ఇసుక అక్రమ వ్యాపారులకు వరంగా మారింది. దీనిపై మైనింగ్‌శాఖ ఏడీ జైసింగ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. నీటిపారుదల శాఖ అనుమతి రాగానే రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**పట్టుకుంటున్నా..** కోరుట్ల మండలంలో 15 రోజుల్లో 18 ఇసుక ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు పట్టుకొని తహసీల్ కార్యాలయం, ఆర్టీసీ డిపోనకు తరలించారు. ఇటీవల మూడు ఇసుక లారీలను స్వాధీనం చేసుకొని రూ.50 వేల వరకు జరిమానా విధించారు.

# నిఘా.. దేవుడెరుగు!



కీసర : శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మొత్తం 12 సీసీ కెమెరాలుండగా అందులో 9 మాత్రమే పనిచేస్తున్నాయి. నగరంలోని ప్రార్థనా మందిరాల దగ్గర భద్రతపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రముఖ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. దీన్ని అవకాశంగా తీసుకుని ఆకతాయిలు, చోరులు రెచ్చిపోతున్నారు. తాజాగా సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలోకి దుండగుడు చొరబడి విగ్రహం ధ్వంసం చేసిన ఘటనతో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో నగరంలోని ముఖ్యమైన ఆలయాల వద్ద రక్షణ చర్యలను పరిశీలించగా.. అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి.

**పర్యవేక్షణ లేమితో సమస్యలు..!**

గ్రేటర్ హైదరాబాద్‌లో దేవదాయ శాఖ పరిధిలో 1700 ఆలయాలున్నాయి. ఆదాయాన్ని బట్టి 6ఎ, 6బీ, 6సీగా వాటిని వర్గీకరించారు. వీటి నిర్వహణ పూర్తిగా ఆలయ కమిటీలు పర్యవేక్షిస్తాయి.

తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం ప్రకారం కనీసం 100 మంది కంటే ఎక్కువ మంది రాకపోకలు సాగించే, గుమిగూడే అన్ని రకాల ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాల దృశ్యాలు కనీసం 30 రోజులు భద్రపరిచే విధానం ఉండాలి.

కేవలం నిర్వహణ లోపం, పర్యవేక్షణలేమితో అనేక చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. భద్రతా సిబ్బంది తగినంత లేకపోవడంతో లోపంగా మారింది. ఆలయంలోకి ప్రవేశించే సమయంలో తనిఖీ చేసేందుకు మెటల్ డిటెక్టర్లు లేవు.

**చారిత్రక ఆలయాల్లో నిఘా వైఫల్యం**

ప్రముఖ పుణ్యక్షేత్రం కీసర గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయస్వామి, అక్కన్న-మాదన్న ఆలయం, నాగదేవత ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కు తదితర ప్రాంతాల్లో 50 కెమెరాలున్నా 30 మాత్రమే పనిచేస్తున్నాయి. అడాప్టర్లు కాలిపోవడం, వైర్లు కోతులు తెంపేయడంతో 20 కెమెరాలు పనిచేయడం లేదు.

కాప్రాలోని హెచ్‌బీకాలనీలోని కైలాసగిరి శివకేశవుల ఆలయంలో 12 సీసీ కెమెరాలుండగా.. ఒక్కటీ పనిచేయడం లేదు. ఇటీవల వర్షాలకు అన్నీ చెడిపోగా బాగుచేయలేదు. కమలానగర్‌లోని సహస్రలింగేశ్వరాలయం, ఓల్డ్‌కాప్రాలోని చెన్నకేశవాలయం, కుషాయిగూడలోని పద్మావతి వేంటంకటేశ్వరాలయంలో ఒక్కచోట మెటల్ డిటెక్టర్లు లేవు.

సనత్‌నగర్‌లోని సుప్రసిద్ధ ఏడుగుడుల ఆలయంగా పేరొందిన హనుమాన్ దేవస్థానంలో మెటల్ డిటెక్టర్లు లేవు. ఇంత పెద్ద ఆలయానికి రాత్రిపూట ఒక్కరే కాపలాగా ఉంటున్నారు. 16 సీసీ కెమెరాలుండగా అన్నీ ఆలయం లోపలే ఉన్నాయి. రెజిమెంటల్‌బజార్‌లోని సంతోషిమాత గర్భగుడిలోకి ఇటీవల పట్టపగలు ఓ దొంగ ప్రవేశించి చోరీ చేశాడు. మరో వ్యక్తి భక్తురాలి బ్యాగు దొంగిలించాడు. సీసీ కెమెరాలున్నా సరైన పర్యవేక్షణ లేకపోవడం సమస్య. చందానగర్‌లోని శ్రీవేంకటేశ్వర దేవాలయానికి వెనుక భాగంలో అర్చకుల కోసం గదులు నిర్మించారు. ఇక్కడి నుంచి దేవాలయానికి వెళ్లే దారి సరిగా లేదు. సీసీ కెమెరాలు లేవు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ మార్గంలో ఆలయంలోకి ప్రవేశించే అవకాశముంది. బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానంలో 32 సీసీ కెమెరాలుండగా 20 మాత్రమే పనిచేస్తున్నాయి. వీఐపీ, బోనాల కాంప్లెక్స్, కల్యాణ మండపం, రెండు శాశ్వత రేకులషెడ్లలో నిఘానేత్రాలు లేవు. ఉప్పల్ స్టేడియం సమీపంలో వెలుగుగుట్ట మీద శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో ఈ ఏడాది మూడుసార్లు దొంగలు హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. రెండుసార్లు చోరీ యత్నం జరిగింది. 16 సీసీ కెమెరాలు సగం కూడా పని చేయడం లేదు.

# సమృద్ధిగా భూగర్భ జలాలు



కరీంనగర్ : జిల్లాలో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి.. భూగర్భ జల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మే నెలలో భూగర్భ జలమట్టం జిల్లా సగటు 9.26 మీటర్లు ఉండగా.. అక్టోబరు నెలాఖరులో 4.26 మీటర్లకు చేరుకుంది. అంటే 5 మీటర్ల నీటిమట్టం పెరిగింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో బోర్లు, వ్యవసాయ బావులు రీఛార్జి అవుతున్నాయి. వీటికితోడు ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ఆధారంగా వరద కాలువ ద్వారా మధ్య మానేరు జలాశయం, దిగువ మానేరు జలాశయాలు నింపడంతోనూ చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతుండగా భూగర్భజలాలు అందుబాటులో ఉంటున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

జిల్లా సాధారణ వర్షపాతం 748.9 మి.మీ కాగా వానాకాలంలో కొన్నేళ్ల కిందటి వరకు వర్షంనీటిని భూమిలోకి ఇంకించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టని కారణంగా నీటి ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి. రోజురోజుకూ జనాభా పెరగడంతో నీటి వినియోగం ఎక్కువైనా పొదుపు చర్యలు చేపట్టలేదు. జిల్లాలో నీటి వనరులు ఎక్కువగా ఉండటంతో సమస్య తీవ్రత కనిపించలేదు.

ఈ వానాకాలంలో 1025.6 మి.మీల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 286.7 మి.మీ వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. కురిసిన వర్షాలతో భూమిలోకి నీరు చేరి పాతాళగంగ పైకి వచ్చింది.

జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. ఈ ఏడాది మే నెలతో పోల్చితే సగటు మట్టంతో పెరుగుదల నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత సెప్టెంబరులో 3.31 మీటర్ల పైకి జలాలు ఎగిసి వచ్చాయి.

జిల్లాలో దాదాపు 800 చెరువులు, కుంటలు, నాలుగు జలాశయాలు ఉన్నాయి. దాదాపు 70 శాతం జలాశయాలు నీటితో నిండగా ఇప్పటికీ వరదకాలువ ద్వారా మధ్యమానేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద ఇక్కడకు చేరింది.

**నీటిని పొదుపుగా వాడుకోవాలి**

వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా జలాలు పెరగడంతో పొదుపుగా వాడుకోవాలి. ఎంత అవసరమో అంతే వినియోగించుకోవాలి. నీరుంది కదా.. అంటూ వృథా చేస్తే మళ్లీ నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

నీటి ఇక్కట్లు ఏర్పడిన సమయంలో ప్రతి బిందువు ఎంత విలువైందో తెలుస్తుంది. ఈ నీటిని జాగ్రత్తగా వాడుకుంటే రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని భూగర్భ జలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో భూగర్భ జలాలు (హెక్టా మీటర్లలో..)

వార్షిక లభ్యత : 89,027 హె.మీ

వార్షిక వినియోగం: 24,690 హె.మీ

వినియోగస్థాయి: 27.73 శాతం

భవిష్యత్తు గృహ అవసరాలకు కేటాయింపు: 1200 హె.మీ

మిగులు: 64493 హె.మీ

# పునరావాస గ్రామం.. సమస్యలతో సతమతం

వేములవాడ : జలాశయ నిర్మాణంలో సర్వం త్యాగం చేసిన నిర్వాసితులు తమకు కేటాయించిన ఆర్‌అండ్ఆర్ కాలనీలో సమస్యలు తిష్ఠ వేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సదుపాయాలపై పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో కొదురుపాక కొడుముంజ గ్రామం ముంపునకు గురైంది. నిర్వాసితులకు నాంపల్లి శివారులోని నందికమాన్ వద్ద ఆర్‌అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. జలాశయంలో నీటి నిల్వ అనంతరం నిర్వాసితులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకొని ఇక్కడే నివాసం ఉంటున్నారు.

కాలనీ ఏర్పాటు సమయంలో తాగునీటి పైపులైన్, మురుగు కాలువలు, ఇతర సదుపాయాలు కల్పించారు. అయితే నిర్వాసితులు కాలనీకి వచ్చిన అనంతరం ఏర్పడిన సమస్యలను పరిష్కరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన అనంతరం గ్రామంలో ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది.

ప్రస్తుతం మిషన్ భగీరథ తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు, పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

ప్రధాన సమస్యలు ఇవీ...

పలు చోట్ల కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తుంది.

దోమల బెడద అధికంగా ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఉంటుంది. పలు చోట్ల ఎత్తుగా ఉండటం వల్ల పైపులైన్‌ల నుంచి నీరు రావడం లేదు. డ్రమ్ములలో నీటిని పట్టుకొని వాడుకుంటున్నారు.

నీటి సరఫరా పైపులైన్‌లు పలు చోట్ల లీకవుతున్నాయి. వీధులు బురదగా మారుతున్నాయి.

వైకుంఠధామానికి దారి లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పరిష్కరించాలి

గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వైకుంఠధామానికి వెళ్లే దారి సమస్య పరిష్కరించాలి.

బూర రాజశేఖర్, స్థానికుడు, కొడుముంజ, ఆర్‌అండ్ఆర్ కాలనీ

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

గ్రామంలో పారిశుద్ధ్యం, నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. సమస్యలను పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. రాజీవ్ మల్హోత్రా, ఎంపీడీవో, వేములవాడ

# విద్యుత్తేజం.. ఎన్టీపీసీ కాంతి కిరణం

కరీంనగర్ : దక్షిణాది విద్యుత్తు దిగ్గజం ఎన్టీపీసీ రామగుండం పరిశ్రమ ఏర్పడి నేటికి 46 వసంతాలు పూర్తి చేసుకుంది. అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ 1978 నవంబరు 14న పునాదిరాయి వేయగా, దక్షిణాది వెలుగులకు కేంద్రంగా రామగుండం పేరు తెచ్చుకుంది. 200 మెగావాట్ల 3 యూనిట్లు, 500 మెగావాట్ల 4 యూనిట్లతో.. 2600 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. పరిశ్రమ ఆవిర్భావం సందర్భంగా ప్రత్యేక కథనం..

**మరో మైలురాయికి సిద్ధంగా**

తెలంగాణ కోసం ప్రత్యేకంగా 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలన్న నిబంధన మేరకు ఎన్టీపీసీ ఇప్పటికే రూ.10,598 కోట్ల వ్యయంతో 1600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లను నిర్మించింది. రూ.29,344 కోట్ల అంచనా వ్యయంతో రెండో దశ నిర్మాణంలో భాగంగా 2,400 మెగావాట్ల విద్యుత్తు ప్లాంటును మరో మైలురాయికి సిద్ధం చేస్తోంది.

**హరితహారానికి నిధులు అందించి**

హరితహారానికి సంబంధించి ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యత పథకం(సీఎస్సార్) కింద గతంలో రామగుండం ప్రాజెక్టు నిధుల్లో సుమారు రూ.15 కోట్లు ప్రభుత్వానికి అందజేసింది. అలాగే తెలంగాణ ప్రాజెక్టు పరిసరాల అభివృద్ధిలో భాగంగా రూ.1.62 కోట్లను అందజేసింది. పరిశ్రమ నుంచి వెలువడుతున్న బూడిదను వినియోగించి సిమెంట్ రహిత(జియోపాలిమర్) రహదారిని నిర్మించి ఆదర్శంగా నిలిచారు. బూడిద చెరువులో పేరుకున్న పొర(సినోస్పి యర్)ను పింగాణి పరిశ్రమల్లో వినియోగానికి అధ్యయనం చేశారు.

**అన్‌లాగ్ నుంచి డిజిటల్ దిశగా**

15 ఏళ్ల క్రితం అన్‌లాగ్ విధానంలో ఎన్టీపీసీ విద్యుత్తు ఉత్పత్తి చేసింది. సాంకేతిక అభివృద్ధితో డిజిటల్ కంట్రోల్ సిస్టమ్ విధానంలో ఒకేచోట ఉండి నియంత్రణ చేపడుతున్నారు. పర్యావరణ రక్షణకు 200 మెగావాట్ల మూడు యూనిట్ల టర్బైన్, జనరేటర్ విభాగాలను ఆధునికీకరిస్తున్నారు. నేడు 680 మంది ఉద్యోగులు, అధికారులు నాణ్యమైన విద్యుత్తు ఉత్పత్తికి దోహదపడుతుండగా.. 4500 మంది



ఒప్పంద కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

**విష వాయువులను తగ్గించేందుకు**

2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీలో వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించటానికి ఎఫ్‌జీడీ(ఫ్యూయల్ గ్యాస్ డీసల్ఫరైజేషన్) యూనిట్‌ను నెలకొల్పనున్నారు. మరోవైపు సౌర విద్యుత్తును మరింత ఉత్పత్తి చేయటానికి మరో అడుగు ముందుకువేసింది. 100 మెగావాట్ల నీటిపై తేలియాడే సౌర ఫలకాల విద్యుత్తు కేంద్రం నిర్మాణం కూడా పూర్తిచేసింది.

ఎన్టీపీసీ సాధించిన అవార్డులు

2018-19 సంవత్సరానికి స్వర్ణశక్తి అవార్డు

నేషనల్ ఎనర్జీ లీడర్-2019 అవార్డు

2017-18 సంవత్సరానికి హీట్ రేట్ ట్రోఫీ

ప్రజా ఆధారిత అభ్యాసాలు, సీఎస్ఆర్ ఆవిష్కరణలకు కాంస్య అవార్డులు

ఐఎస్ఓ-50001 ధ్రువీకరణ సర్టిఫికెట్

ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు-2024 ఎనర్జీ కంపనీ, గ్రామీణ క్రీడల నైపుణ్య బంగారు అవార్డు సామాజిక అవగాహన యాడ్ ఫిల్మ్, హెచ్ఆర్ వైవిధ్య బంగారు అవార్డులుఅంతర్జాతీయ ఎనర్జీ, ఎస్ఆర్ఈఐ, పవర్ క్విజ్ విజేత అవార్డులు

# రుణమాఫీ నిధులపై కర్షకుల కలవరం

జగిత్యాల : ఈ నెలలో, డిసెంబరులో మిగిలిన రైతులందరికీ పంట రుణమాఫీ నిధులను విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. మరోవైపు అర్హులైఉండి మాఫీ నిధులందని జిల్లాలోని వేలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఇలా అయితే ఎలా?**

జిల్లాలోని ఓ రెండు బ్యాంకుల పరిధి 7 బ్రాంచిల్లో పంటరుణం తీసుకున్న 4,161 మంది రైతులకు చెందిన రూ.51 కోట్లు మాఫీ కాలేదు. ఇదేమని జిల్లా అధికారులు ఆరాతీస్తే హైదరాబాద్‌లోని సెంట్రల్ సర్వర్‌లో జరిగిన పొరపాటుగా గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం 12.12.2018 నుంచి 9.12.2023 వరకు తీసుకున్న నూతన రుణాలు, రెన్యూవల్స్‌ను పరిగణలోకి తీసుకుని పంట రుణాలను మాఫీ చేసింది కానీ.. ఈ రెండు బ్యాంకుల పరిధిలో 4,161 మంది రైతులు 12.12.2018 కన్నా ముందుగా రుణం తీసుకుని కటాఫ్ తేదీల్లోనే రెన్యూవల్ చేసినా జాబితాలో చేర్చలేదు. వీరికి మాఫీ రావాలంటే రాష్ట్ర కేబినేట్ తీర్మానం మేరకు ప్రిన్సిపల్ సెక్రెటరీ సంతకం అవసరమని రాష్ట్ర ఉన్నతాధికారులు పేర్కొన్నారు. తమకు నిధులందేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 2.70 లక్షల పంటరుణ ఖాతాలుండగా రేషన్‌కార్డుల ఆధారితంగా కుటుంబానికి రూ.2 లక్షల వరకే మాఫీ వర్తింపచేయటం, ప్రభుత్వ ఉద్యోగులు, ఒకరి పేరిటనే ఎక్కువ రుణాలుండటం తదితర కారణాలను మినహాయిస్తే 1,38,142 మందికి అర్హులుగా గుర్తించారు.

అర్హుల్లోనూ రూ.2 లక్షల్లోపు రుణమున్నవారిలో మొదటి మూడు విడతల్లో అనేక కారణాలతో జిల్లాలో 4,474 మందికి నిధులందలేదని ఫిర్యాదు చేశారు.

రేషన్‌కార్డుల్లేని 11 వేల కుటుంబాలను గుర్తించగా రూ.2 లక్షలకన్నా అధికంగా రుణమున్నవారు 50 వేలమందికిపైగా ఉన్నట్లు గుర్తించారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగిన భర్త విదేశాలకు వెళ్లటంతో వారి భార్యల పేరిట పంటరుణాన్ని ఇచ్చారు.

ప్రస్తుతం మహిళల పేరిట పట్టాదారు పాసుపుస్తకం లేనట్లు జాబితాలో రావటంతో ఈ అంశంపై సందిగ్ధం నెలకొంది.

రుణ ఖాతాలను మూసివేయటం, అసలుకన్నా వడ్డీ అధికంగా ఉండటం, బంగారం తనఖా రుణాలు తదితర 35 రకాల కారణాలతో చాలామంది మాఫీ జాబితాలోకి రాకపోగా వీరి సమస్యలను నిధుల విడుదలలోపు పరిష్కరించాల్సి ఉంది. అర్హుల్లో పంటరుణం మాఫీగాని కారణాలను విశ్లేషించి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదించినట్లు డీఏవో రాంచందర్, ఎల్‌డీఎం రామ్‌కుమార్ పేర్కొన్నారు. కొన్ని సంఘాల్లో తమ పేరిట ఒకటికన్నా ఎక్కువ రుణాలను తీసుకున్నట్లు వందలాది మంది రైతులు అధికారులకు ఫిర్యాదు చేయగా ఇవి బోగస్ రుణాలుగా గుర్తించారు.

# చిన్న పిల్లల్లో న్యూరో సమస్యకు చెక్

హైదరాబాద్: ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్‌లో తొలిసారి పీడియాట్రిక్ న్యూరో విభాగం అందుబాటులోకి రానుంది. కొత్త ఏడాది నుంచి పూర్తి స్థాయిలో ఈ సేవలు అందుబాటులోకి తేనున్నారు. వెన్నుపాము, నాడీ వ్యవస్థ, మెదడుకు సంబంధించి పిల్లల్లో వచ్చే రుగ్మతలకు ఈ విభాగంలో చికిత్సలు అందజేయనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిలోఫర్ ఆసుపత్రిలో ఒక న్యూరో ఫిజీషియన్ ఆధ్వర్యంలో ఓపీలో చికిత్సలు చేస్తున్నారు. ఎక్కువగా ఫిట్స్, బ్రెయిన్ ట్యూమర్లు, ఆటిజం ఇతర న్యూరో సమస్యలతో 0–12 ఏళ్ల లోపు పిల్లలు చికిత్సలకు వస్తుంటారు. పుట్టుకతోనే వచ్చే నాడీ సంబంధిత సమస్యలకు చిన్నారులు నిలోఫర్‌ను ఆశ్రయిస్తుంటారు. అయితే ప్రత్యేక




పీడియాట్రిక్ న్యూరో విభాగంతో పాటు వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిమ్స్‌లో పూర్తిస్థాయి పీడియాట్రిక్ న్యూరో విభాగం ఏర్పాటు చేయనున్నారు. వైద్యుల కేటాయింపు, అవసరమైన పడకలు, ల్యాబ్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, జనవరి 6 నుంచి పూర్తి స్థాయిలో చిన్నారులకు సంబంధించి అన్ని రకాల న్యూరో సమస్యలకు చికిత్సలు అందించనున్నట్లు నిమ్స్ న్యూరో విభాగం వైద్యులు డాక్టర్ సూర్యప్రభ తెలిపారు.

అందుబాటులోకి రానున్న చికిత్సలు
పిల్లల్లో మూర్ఛ
అపస్మారక స్థితి
నియోనాటల్ న్యూరాలజీ
తలనొప్పి/మైగ్రేన్
నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే వ్యాధులు
న్యూరో అంకాలజీ
నిద్ర రుగ్మతలు
ఆటిజంతోపాటు పిల్లల్లో శారీరక అభివృద్ధి లోపాలు
పుట్టుకతో వచ్చే న్యూరోమస్కులర్ డిజార్డర్లు
మెదడు, వెన్నులో పుట్టుకతో వచ్చే సమస్యలు
హైడ్రోసెఫలస్, పిల్లల తల వెన్నుపాము గాయాలు

# మూసీ పునరుజ్జీవానికి బీజం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ కార్యక్రమం ప్రారంభమైంది. కీలకమైన బృహత్తర ప్రణాళిక(మాస్టర్‌ప్లాన్) తయారీ పనులు మొదలయ్యాయి. కాంట్రాక్టు దక్కించుకున్న సింగపూర్ కన్సార్టియానికి చెందిన మెన్‌హర్డ్ సంస్థ రంగంలోకి దిగినట్లు మూసీనది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) వెల్లడించింది. డిసెంబరు నెలాఖరు నాటికి సంస్థ ఇన్‌సెప్షన్ నివేదిక సమర్పించి, తర్వాత కీలకమైన క్షేత్రస్థాయి డిజిటల్ సర్వేను చేపడుతుందని అధికారులు చెబుతున్నారు. మొదటి దశలో జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 20 కి.మీ పరివాహక ప్రాంతానికి మాస్టర్‌ప్లాన్ రూపుదిద్దుకుంటుంది. సర్వేకు ప్రభుత్వం రూ.141.08 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 66 నెలల్లోపు మాస్టర్ ప్లాన్ తయారీ పూర్తవ్వాలన్నది ఒప్పందంలోని నిబంధన.ప్రణాళిక కీలకం.. జంట జలాశయాల నుంచి తూర్పున



రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న గౌరెల్లి గ్రామం వరకు మూసీ నది 55కి.మీ మేర నగరంలో ప్రవహిస్తోంది. దాని పొడవునా ఉన్న నదీ పరివాహక ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించి, దశలవారీగా అభివృద్ధి చేయాలన్నది ప్రాథమిక నిర్ణయం. కన్సల్టెన్సీ సంస్థ నదీ పరివాహక ప్రాంతంతో పాటు నదికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములను సవివరంగా సర్వే చేయనుంది. నదీగర్భం, బఫర్‌జోన్‌తోపాటు దాదాపు అర కిలోమీటరు పరిధిలోని భూ వివరాలను మాస్టర్ ప్లాన్‌లో చేర్చనున్నారు. ఖాళీ స్థలాలు, నది ఎత్తుపల్లాలు, కాంటూర్ స్థాయిలు, వృక్ష సంపద, రోడ్లు, నిర్మాణాలను అందులో నమోదు చేసుకుంటారు. అభివృద్ధి పనుల్లో.. మొదట నదికి ఇరువైపులా వరద నీటి రక్షణ గోడ నిర్మాణం ఉంటుందని, తర్వాత ఇతర పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5కి.మీ, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5కి.మీ నదీ పరివాహక ప్రాంతం హైదరాబాద్ రూపురేఖలను మార్చే విధంగా అభివృద్ధి అవుతుందని అంటున్నారు.

# హీటర్ల మోత..!

హైదరాబాద్: నగరంలో చలికాలంలో విద్యుత్తు డిమాండ్ అసాధారణంగా పెరుగుతోంది. వారం రోజులుగా సిటీలో 3 వేల మెగావాట్లపైనే నమోదవుతోంది. గరిష్ఠ డిమాండ్ 3263 మెగావాట్లు రికార్డైంది. గత ఏడాది ఇదే రోజు 2645 మెగావాట్లు మాత్రమే.

వేసవిలో ఏసీల ఉపయోగంతో కరెంట్ వినియోగం పెరిగితే.. చలికాలంలో హీటర్లు మోత మోగిస్తున్నాయి. చలి మొదలు కావడంతో వేడినీళ్ల కోసం గీజర్లను పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నారు. కార్తిక మాసం నేపథ్యంలో ఇళ్లకు విద్యుత్తు దీపాల అలకంరణతోనూ వాడకం పెరిగింది. గత ఏడాది నవంబరు 12న 51.11 మిలియన్ యూనిట్లు ఉంటే.. ఈసారి 62.85 మి.యూ.లకు పెరిగింది. పెరుగుదల 23 శాతంగా నమోదైంది.

భిన్న వాతావరణం.. సాయంత్రం చలి మొదలవుతోంది. పగలు ఎండ చురుక్కుమనిపిస్తోంది. భిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా కూడా విద్యుత్తు వాడకంలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ఒక్కోరోజు ఒక్కోలా డిమాండ్ ఉండటంతో నిర్వహణ డిస్కంకు సవాల్‌గా మారుతోంది.

# వీడని భయం.. చేరని జనం



వికారాబాద్ : లగచర్లలో జరిగిన అధికారులపై దాడి ఘటన, తదనంతరం పోలీసులు సోదాలు, నిందితుల అరెస్ట్ వంటి వరుస పరిణామాలతో ప్రజల్లో నేటికీ తీవ్ర భయాందోళనలు వైదొలగలేదు. విచారణ పేరుతో పోలీసులు ఎప్పుడు వచ్చి ఎవరిని తీసుకెళ్తారోనన్న భయం వెంటాడుతోంది. పురుషులు ఇళ్లకు రాకుండా దూరప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నట్లు తెలిసింది. బుధవారం కూడా మూడు గ్రామాల్లో మహిళలు ఇళ్లలో ఉండకుండా ఉదయమే పొలాలకు వెళ్తున్నారు. సాయంత్రం వరకు పిల్లలతో పొలాల్లోనే గడిపి బిక్కుబిక్కుమంటూ రాత్రికి చేరుకుంటున్నారు. లగచర్లలో కొద్ది మంది మాత్రమే బయటకు వచ్చి అటూఇటూ తిరుగుతూ కనిపించారు కానీ రోటిబండ తండా, పులిచర్లకుంటతండాలు నిర్మానుష్యంగానే కనిపించాయి.

**ఊపిరి పీల్చుకున్న 34 కుటుంబాలు**

సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం 16 మందిని రిమాండ్‌కు తరలించి, మిగిలిన 34 మందిని విడిచిపెట్టారు. వీరంతా ఇళ్లకు చేరడంతో వారి కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న సురేష్‌తో పాటు పలువురు ఇంకా పరారీలోనే ఉన్నట్లు సమాచారం.

**మూడోరోజూ నిలిచిన అంతర్జాల సేవలు**

సోమవారం రాత్రి 10 గంటలకు నిలిపివేసిన అంతర్జాల సేవలను ఇంకా పునరుద్ధరించలేదు. దీంతో మీసేవ కేంద్రాలు వెలవెలబోయాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అంతర్జాల సేవలు పొందడానికి కొందరు బొంరాస్‌పేట మండల కేంద్రానికి సమీపంలోని గడిసింగాపూర్‌కు వెళ్తున్నారు.

**బొంరాస్‌పేట పీఎస్‌లోనే బలగాల మకాం**

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పోలీసుల బలగాలు బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌లోనే మకాం వేశాయి. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పోలీసులు వెళ్లే విధంగా ఉన్నతాధికారులు బలగాలను ఇక్కడే ఉంచారు. **భారీ బందోబస్తు.. ఎక్కడికక్కడ కట్టడి**

**నరేందర్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో పోలీసుల పటిష్ఠ చర్యలు**

దుద్యాల మండలం లగచర్ల ఘటన నేపథ్యంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు ఏ–1గా కేసు నమోదు చేయడం తదితర పరిణామాలతో వికారాబాద్ జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆయనను తొలుత హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని తరువాత వికారాబాద్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి (డీటీసీ) విచారణ నిమిత్తం తరలించారు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచి, భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న వికారాబాద్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేష్‌రెడ్డిలు ఉదయం 9:30 గంటలకు అక్కడికి చేరుకోగా, పోలీసులు లోపలికి అనుమతించలేదు. అసలు ఎవరినీ ఇక్కడికి తీసుకురాలేదన్నారు. పక్కా సమాచారం మేరకే వచ్చామని చెప్పినా వినిపించుకోలేదు. ఒక్కొక్కరుగా భారాస శ్రేణులు అక్కడికి చేరుకోవడం, మాజీ ఎమ్మెల్యేలు కలవడానికి బలవంతపెట్టడంతో నరేందర్‌రెడ్డితో రెండు నిమిషాల పాటు కలవడానికి అనుమతించారు. అక్రమంగా పోలీసులు తనను కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని నరేందర్‌రెడ్డి వారికి వివరిస్తుండగా, పోలీసులు ఇక మాట్లాడటం చాలని మాజీ ఎమ్మెల్యేలను బయటకు పంపించారు. అనంతరం మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి రాగా, పోలీసులు అనుమతించలేదు.

# వాన‘రణసేన’



హైదరాబాద్: నిబంధనల ప్రకారం కోతులను బంధించాలి. స్థానిక సంస్థల అనుమతితో బోన్లలో బంధించి, అటవీశాఖ అనుమతి తీసుకున్నాక అడవుల్లో వదిలిపెట్టాలి. దీంతో సమయం, డబ్బు వృథా అనే ఉద్దేశంతో కొందరు.. ఓ ప్రాంతంలోని వానరాలను బంధించి సమీప గ్రామాల శివారులో, రోడ్ల పక్కన విడిచిపెడుతున్నారనే ఫిర్యాదులొస్తున్నాయి.నగరానికి వానరసేన గుంపులుగా వస్తోంది. కోతులను పట్టే కొందరు .. ఇతర ప్రాంతాల్లో బంధించిన వాటిని ఓఆర్‌ఆర్‌పై విడిచిపెడుతున్నారు. అక్కడి నుంచి రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాలపైకి దండెత్తుతున్నాయి. ఇళ్ల పైకప్పు ధ్వంసం చేస్తున్నాయని, గుంపులుగా సంచరిస్తూ దాడి చేస్తున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా ప్రధాన నగరంలోనూ అవి సంచరిస్తున్నాయి. శివారు నుంచి వస్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.నిబంధనల ప్రకారం కోతులను బంధించాలి. స్థానిక సంస్థల అనుమతితో బోన్లలో బంధించి, అటవీశాఖ అనుమతి తీసుకున్నాక అడవుల్లో వదిలిపెట్టాలి. దీంతో సమయం, డబ్బు వృథా అనే ఉద్దేశంతో కొందరు.. ఓ ప్రాంతంలోని వానరాలను బంధించి సమీప గ్రామాల శివారులో, రోడ్ల పక్కన విడిచిపెడుతున్నారనే ఫిర్యాదులొస్తున్నాయి.నగరానికి వానరసేన గుంపులుగా వస్తోంది. కోతులను పట్టే కొందరు .. ఇతర ప్రాంతాల్లో బంధించిన వాటిని ఓఆర్‌ఆర్‌పై విడిచిపెడుతున్నారు. అక్కడి నుంచి రింగ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాలపైకి దండెత్తుతున్నాయి. ఇళ్ల పైకప్పు ధ్వంసం చేస్తున్నాయని, గుంపులుగా సంచరిస్తూ దాడి చేస్తున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా ప్రధాన నగరంలోనూ అవి సంచరిస్తున్నాయి. శివారు నుంచి వస్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

**బాటసింగారం గ్రామంలో ఇళ్ల ముందు కోతులు**

**టెండర్లకు ఆదరణ లేదు..**

నగరంలో కోతులను పట్టే కుటుంబాలు గతంలో ముషీరాబాద్‌లో ఉండేవి. జీహెచ్‌ఎంసీతో కలిసి ఆ కుటుంబాలు కొన్నేళ్లుగా సేవలందించాయి. పాత తరం వారంతా చనిపోయారు. నేటి తరం వారు ఇతర వృత్తుల్లో చేరారు. జీహెచ్‌ఎంసీ రెండేళ్లుగా టెండర్లు పిలుస్తూనే ఉంది. ఇటీవల ఆహ్వానించిన టెండరుకు కూడా స్పందన కరవైంది. ఏడాది కింద పలు గ్రామాలు ఒక్కో వానరాన్ని పట్టేందుకు రూ.600 ఖర్చు చేశాయి. తర్వాత.. అవి మళ్లీ గ్రామాల్లోకి వస్తుండటంతో సర్పంచులు చేతులెత్తేశారు.

ఓఆర్‌ఆర్ తూర్పు వైపు ఉండే గౌరెల్లి, బాటసింగారం, కుత్బుల్లాపూర్, కుంట్లూరు, ప్రతాపసింగారం, ఘట్‌కేసర్, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట, కోహెడ, బండరావిరాల తదితర గ్రామాల్లో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగింది. పండ్ల మార్కెట్ కోహెడలో నడుస్తుండటంతో.. చుట్టుపక్కల గ్రామాల్లోని అవి అటువైపు వెళ్తున్నాయని స్థానికులు తెలిపారు.

ఓఆర్‌ఆర్‌కు పశ్చిమాన ఉన్న దర్గాఖలీజ్‌ఖాన్, హిమాయత్‌సాగర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బైరాగిగూడ, హైదర్‌షాకోట్ తదితర ప్రాంతాల్లోనూ సమస్య పెరుగుతోంది. మూసాపేట, బోరబండ, ఖైరతాబాద్ ప్రాంతాల్లోనూ అవి అక్కడక్కడ కనిపిస్తున్నాయి.

బోన్లు సిద్ధం చేసిన బల్దియా..

కోతులను పట్టేవారు లేకపోవడంతో.. జీహెచ్‌ఎంసీ స్వయంగా బోన్లను సమకూర్చుకుంది. ఫిర్యాదు రాగానే.. ఆ ప్రాంతానికి వెళ్లి ఇళ్ల పైకప్పుపై, నీడ ఉండే చోట వాటిని ఏర్పాటు చేస్తున్నామని యంత్రాంగం తెలిపింది. సమస్య ఉంటే.. ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదు చేయాలని లేదా 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్ రూం నంబరు 040 2111 1111ను సంప్రదించాలని జీహెచ్‌ఎంసీ సూచించింది.

# అదను చూసి.. చదును చేసి

సిరిసిల్ల: ప్రభుత్వ భూముల రక్షణకు రెవెన్యూ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు గాలిలో దీపంలా మారాయి. సంవత్సరాల తరబడి అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అదను చూసి చదును చేస్తూ ఆక్రమించేస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో వందల ఎకరాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో వందల ఎకరాల ప్రభుత్వ భూములు పంట పొలాలుగా మారిపోతున్నాయి. ప్రైవేటు భూములు ఈ ప్రాంతంలో ఎకరం రూ.20 లక్షలపైనే ధర పలుకుతున్నాయి. నాలుగేళ్ల క్రితం గుట్ట నుంచి వచ్చే వరదను భూమిలోకి ఇంకించి చుట్టూ భూగర్భజలాలు పెంచేందుకు ఉపాధి హామీ పథకంలో ఇక్కడ నీటి నిల్వ కుంటలు తవ్వారు. ఆక్రమణలతో అవి ఇప్పుడు పంట పొలాల మధ్యలోకి మారాయి.పంటల సీజన్ ముగిశాక భారీ యంత్రాలతో గుట్టకు ఉన్న పెద్ద వృక్షాలు, రాళ్లను యంత్రాలతో తొలగించి చదును చేస్తున్నారు. ఇలా వందల ఎకరాలను పంట పొలాలుగా మార్చారు.

ఏళ్ల తరబడి జరుగుతున్న ఈ ఆక్రమణలు రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. కనీసం ఇవి ప్రభుత్వ భూములు అని చెప్పేందుకు ఇక్కడ ఎలాంటి హద్దులు లేవు. దీని పక్కనే జిల్లెల్ల– ముస్తాబాద్ రెండు వరుసల రహదారి పనులు అటవీ అనుమతుల్లేక నాలుగేళ్లుగా నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగడం లేదు. ఇది ఆక్రమణలకు మరింత కలిసి వస్తోంది.

**భూ ఆక్రమణల నిరోధక చట్టం లేక...** ప్రభుత్వ భూముల రక్షణకు పదునైన చట్టం అమల్లోకి తెచ్చేందుకు రెవెన్యూశాఖ కసరత్తు చేస్తోంది.

జిల్లాలోనూ చాలా చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. అయితే ఇందులో అటవీ, రెవెన్యూ హద్దుల వివాదంలో ఉన్నవి కూడా ఉన్నాయి. రెవెన్యూ యంత్రాంగం వీటి స్వాధీనానికి ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆక్రమణల నిరోధానికి రాష్ట్రంలో చట్టం లేకపోవడమే ఇందుకు కారణం. ఉమ్మడి రాష్ట్రంలో 2016 వరకు భూ ఆక్రమణల నిరోధక చట్టం (ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్) ఉంది. ప్రత్యేక రాష్ట్రం తర్వాత కూడా కొన్ని నెలలకు ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై న్యాయపరమైన చర్యలకు అవకాశం లేకుండా పోయింది. రాష్ట్రంలో మరింత పటిష్ఠమైన సెక్షన్లతో చట్టాన్ని తీసుకురానున్నారు. ఇందులో నమోదైన కేసుల కోసం ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలోనూ రెవెన్యూశాఖ ప్రణాళికలు చేస్తోంది. దీనిపై ప్రభుత్వం వివరాలు తీసుకుని పాత చట్టంలో ఏయే అంశాలున్నాయి, కొత్త చట్టం ఎలా ఉండాలి? ఎలాంటి సెక్షన్లు పొందుపరచాలి అనే దానిపై రెవెన్యూలోని సీనియర్ అధికారులు పరిశీలిస్తున్నారు.

# నిధుల సమీకరణకు అన్వేషణ!

హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్, డబుల్ డెక్కర్ రహదారులకు సంబంధించి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) నిధుల అన్వేషణలో ఉంది. చైనాకు చెందిన ఎన్‌డీబీ బ్యాంకుతోపాటు హడ్కో, జైకా లాంటి సంస్థలతో తాజాగా సంప్రదింపులు చేపడుతున్నారు. వడ్డీ రేట్లను పరిగణలోకి తీసుకొని ఏ సంస్థ నుంచి రుణం సేకరించాల్సిన విషయంపై ఉన్నత స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ విషయం కొలిక్కి వచ్చిన తర్వాత టెండర్లు చేపట్టే అవకాశాలున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి నిధుల సమీకరణ కీలకంగా మారింది. చైనా బ్యాంకే కాకుండా జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ(జైకా), హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(హడ్కో) లాంటి సంస్థ నుంచి నిధుల



సేకరణకు కసరత్తు చేస్తున్నారు.

**ఆలస్యమైతే.. పెరగనున్న వ్యయం..**

డబుల్ డెక్కర్ రహదారికి రూ.1580 కోట్లు, రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2,232 కోట్లు అవసరం. జాప్యమయ్యే కొద్దీ వ్యయం పెరిగే అవకాశం ఉండటంతో పనుల వేగంపై హెచ్‌ఎండీఏ దృష్టి సారిస్తోంది.ప్రైవేటు ఆస్తులు కోల్పోతున్న వారికి పరిహారం కింద టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. చాలామంది నగదు పరిహారం అడుగుతున్నారు.ఎన్‌హెచ్–44పై రూ.1580 కోట్లతో 5.320 కి.మీ.ల మేర డబుల్ డెక్కర్ కారిడార్, దానిపై మెట్రో నిర్మించనున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి మొత్తం ఆరు లేన్ల రహదారి తాడ్‌బండ్, బోయినపల్లి జంక్షన్ల మీదుగా డెయిరీ ఫాం రోడ్డు వద్ద ముగుస్తుంది. దీంతో ఆదిలాబాద్ వైపు జిల్లాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి.

# కేంద్రాలు.. సౌకర్యాలు.. అరకొరే!

పరిగి : అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం జిల్లాలో నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. సదుపాయాల కల్పన మాత్రం విస్మరించారు. దీంతో కేంద్రాలకు ధాన్యం తీసుకువెళ్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. కొన్నిచోట్ల అసలు ఇంతవరకు కొనుగోళ్లే ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో కథనం.

**వేచి చూడక తప్పడంలేదు**

ఆయా కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయక పోవడంతో రైతులు వేచి చూడక తప్పడంలేదు. మరో పక్క వారం రోజుల్లో అన్ని కేంద్రాలకు ధాన్యం తరలింపు తాకిడి పెరగనుంది. అధికారులు అప్రమత్తం కావాల్సి ఉండగా ఆమేరకు ప్రక్రియ వేగవంతం కావడం లేదు. కొన్ని చోట్ల పౌరసరఫరాల శాఖ నుంచి టార్పాలిన్లు సమకూరక పోవడంతో రైతులే సొంత టార్పాలిన్లు కేంద్రాలకు తీసుకు వచ్చి వాటిలోనే ఆరబెట్టుకుంటున్నారు.

కేటాయించక పోవడం మరో కారణం: జిల్లాలో మిల్లులకు ధాన్యం కేటాయింపు జరగక పోవడంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇందుకు ప్రభుత్వం తీసుకు వచ్చిన ధాన్యం నూతన విధానం ఖరారు కాలేదు. బ్యాంకు గ్యారంటీ వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. రైతులు తీసుకు రావడం లేదంటున్నారు

కుల్కచర్ల గ్రామీణ: కుల్కచర్ల మండలం సాల్వీడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వారం క్రితం కోనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నేటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. రైతులు ధాన్యాన్ని తీసుకురావడం లేదని ఐకేపీ సిబ్బంది చెబుతున్నారు.



ఇవీ లెక్కలు
మొత్తం కేంద్రాలు: 107
ప్రారంభమైన కేంద్రాలు: 76
ధాన్యం కొంటున్న కేంద్రాలు: 1
అవసరమైన గోనె సంచులు: 25 లక్షలు
ఇప్పటి వరకు సమకూరినవి: 6.14 లక్షలు
రైస్ మిల్లులు: 76
పంట వివరాలు
సాధారణ సాగు విస్తీర్ణం: 99,549 ఎకరాలు
సాగైంది: 1,30,000 ఎకరాలు
దొడ్డురకాలు: 73శాతం
సన్నరకాలు: 27శాతం

**యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేస్తాం**

జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం కూడా జాప్యానికి కారణమవుతోంది.
సుగుణా బాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి.

**తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది**

మొదట సాగు చేసిన రెండెకరాల్లో పంట కోస్తే 40క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రంలో బస్తాలు లేకపోవడంతో చివరకు బయటి మార్కెట్లో రూ.వంద తక్కువగా అమ్ముకోవాల్సి వచ్చింది. పైగా కమీషన్ వందకు రూ.4చొప్పున అదనంగా నష్టపోయాను.పాండు, రైతు, మోత్కూరు.




# లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా మహారాష్ట్ర.. ఎన్డీయేతోనే సాధ్యం: పవన్ కల్యాణ్

రూ.లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా మహారాష్ట్ర మారాలంటే ఎన్డీయే కూటమి వల్లే సాధ్యమని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి తరపున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాందేడ్ జిల్లా డెగ్లూర్‌లో నిర్వహించిన సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్.. ఛత్రపతి శివాజీపై తనకున్న గౌరవాన్ని తెలిపేందుకు ఈ రాష్ట్ర నేలపైకి వచ్చానని తెలిపారు.

# చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతి




హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబునాయుడి సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి.. రామ్మూర్తి నాయుడు మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు.

చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఏపీ మంత్రి నారా లోకేశ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకొని ఇవాళ ఉదయమే హైదరాబాద్ చేరుకున్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు.

# వైకాపా సోషల్ మీడియా కన్వీనర్, కో-కన్వీనర్లకు 41-ఏ నోటీసులు



కడప: వైఎస్ఆర్ జిల్లాలోని వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ వివేకానందరెడ్డి, కో-కన్వీనర్లు సునీత, నిశాంత్, వరకుమార్‌లకు పోలీసులు 41-ఏ నోటీసులు ఇచ్చారు. వర్రా రవీందర్‌రెడ్డి కేసులో విచారణకు శనివారం పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. దీంతో వారి ఇళ్లకు నోటీసులు అంటించిన పోలీసులు.. వారికోసం గాలింపు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు కీలక నేతలపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్‌రెడ్డి, సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్‌రెడ్డిలపై ఐటీ యాక్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

# కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారు: విష్ణుకుమార్ రాజు




అమరావతి: కేంద్ర ప్రభుత్వం గతంలో 7 లక్షల ఇళ్లు కేటాయించిందని భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. 5 లక్షల ఇళ్లకు పాలనా ఆమోదం కూడా ఇచ్చారని చెప్పారు. జగన్ దుర్మార్గంగా 2.3 లక్షల టిడ్కో ఇళ్లను వద్దని రద్దు చేశారని తెలిపారు. టిడ్కో ఇళ్లపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భగా విష్ణుకుమార్ రాజు మాట్టాడారు.

వైకాపా ప్రభుత్వం రాగానే కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపివేశారని చెప్పారు. కాంట్రాక్టర్‌గా తనకు రావాల్సిన బకాయే రూ.87 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. తన లాంటి వ్యక్తి పదిసార్లు ఆత్మహత్య చేసుకోవాలని.. గుండె ధైర్యం ఎక్కువ కాబట్టే ఆ పని చేయలేదని చెప్పారు. కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారని విమర్శించారు. బిల్లులు చెల్లించకపోయినా గుత్తేదారులు పని చేశారని వివరించారు.

వైకాపా హయాంలో నిర్మాణాలు గాలికొదిలేసి పేదలను ఇబ్బంది పెట్టారని తెదేపా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. పేదవాళ్లు కట్టిన డిపాజిట్లు తిరిగి ఇవ్వలేదని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు లేవు.. డిపాజిట్లు తిరిగి రాలేదని దుయ్యబట్టారు.

# పెన్ను కోసం గొడవ.. భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య




నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెన్ను విషయంలో స్నేహితురాలితో ఏర్పడిన స్వల్ప వివాదం నేపథ్యంలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన జెట్టి అనూష నరసరావుపేటలోని ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం హాస్టల్‌లో ఉన్న సమయంలో స్నేహితురాలితో పెన్ను విషయంలో స్వల్ప వివాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అనూష హాస్టల్ భవనంలోని నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకేసింది. హాస్టల్ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కళాశాల యాజమాన్యం ద్వారా విషయం తెలుసుకున్న నరసరావుపేట ఆర్డీవో హేమలత, తహసీల్దార్ వేణుగోపాల్, నరసరావుపేట గ్రామీణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

# వారి మౌనం.. వైసీపీకి శాపం.. ఆ నలుగురి ప్రయాణం ఎటు?

గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ ఎన్నికల్లో భారీ ఓటమితో ఆ పార్టీ కుదేలయ్యింది. పార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న నేతలు దూరమవుతున్నారు. ఒక్కొక్కరుగా గుడ్ బై చెబుతున్నారు. అటు సీనియర్లు సైతం సైలెంట్ అయ్యారు. చాలామంది పార్టీ కార్యకలాపాలు కనీస స్థాయిలో కూడా పాల్గొనడం లేదు. అసలు వారు పార్టీలో ఉన్నారా? లేదా? అన్నా అనుమానాలు కలుగుతున్నాయి. అయితే నేతలంతా మూకుమ్మడిగా పార్టీని వీడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్ రావు, కృష్ణయ్యలు రాజీనామా చేశారు. పార్టీకి దూరమయ్యారు. మరో నలుగురు ఎమ్మెల్సీలు సైతం పార్టీకి గుడ్ బై చెప్పారు. పదవులు వదులుకున్నారు. మరికొందరు అదే బాటలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. రాజా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం పార్టీని వీడుతున్నారు. అయితే ఇలా పార్టీని వీడుతున్న వారితో ఎటువంటి నష్టం లేదు. కానీ పార్టీలో ఉంటూ సైలెంట్ గా ఉన్నారు నలుగురు సీనియర్ నాయకులు. ఇప్పుడు వారి వైఖరి పైనే ప్రధానంగా చర్చ నడుస్తోంది. అసలు వారు పార్టీలో ఉంటారా? ఉండరా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

1. ధర్మాన ప్రసాదరావు: ఉమ్మడి రాష్ట్రంలోనే సీనియర్ నాయకుడు.వైయస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత ఆప్తుడు. 1989లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. చిన్న వయసులోనే మంత్రి పదవి చేపట్టారు. 2004 నుంచి రాజశేఖర్ రెడ్డికి అత్యంత ఆత్మీయుడిగా మెలిగారు. కానీ ఆయన అకాల మరణంతో పరిస్థితి మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో వైసీపీలో చేరాల్సి వచ్చింది. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ధర్మాన దూరమయ్యారు. పార్టీ కార్యకలాపాలకు సైతం హాజరు కావడం లేదు. దీంతో అసలు ఈయన పార్టీలో ఉంటారా? లేదా? అనేది అవమానమే.

2. ముద్రగడ పద్మనాభం: రాజకీయ నాయకుడి కంటే కాపు రిజర్వేషన్ ఉద్యమ నేతగానే సుపరిచితులు ముద్రగడ పద్మనాభం.ఎన్నో రకాల పదవులు చేపట్టారు ఆయన.టిడిపి,కాంగ్రెస్లో పని చేశారు. 2014లో కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని చేపట్టారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి లబ్ధి చేకూర్చారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఆ పార్టీలో చేరలేదు. ఎన్నికలకు ముందు జనసేనలో చేరాలని భావించారు. పవన్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో వైసీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో పవన్ ను ఓడించేందుకు ప్రయత్నించారు. కానీ వర్కౌట్ కాలేదు.వైసిపి ఓడిపోవడంతో ఆ పార్టీలో పెద్దగా యాక్టివ్ గా లేరు ముద్రగడ.

3. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్ వెంట నడిచిన నేతల్లో ఉమారెడ్డి వెంకటేశ్వర్లు ఒకరు. తెలుగుదేశం పార్టీలో సీనియర్ గా ఉన్న ఆయన జగన్ పిలుపుతో ఆ పార్టీలో చేరారు. అయితే ఆయన సీనియారిటీకి తగిన గౌరవం లభించలేదు. ఈ ఎన్నికల్లో బలవంతంగానే ఆయన అల్లుడు గుంటూరు నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు. ఓటమి ఎదురైంది. అయితే శాసనమండలిలో విపక్ష నేత పాత్ర పోషించాలని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఉంది.కానీ జగన్ ఆ పదవి ఇవ్వలేదు. అప్పటినుంచి వైసీపీ కార్యక్రమాల ముఖం చూడడం మానేశారు.

4. గడికోట శ్రీకాంత్ రెడ్డి :కడప జిల్లాకు చెందిన శ్రీకాంత్ రెడ్డి వైయస్ కుటుంబానికి ఆత్మీయ నేత. ఎన్నికల్లో రాయచోటి నుంచి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో మంత్రి పదవి వస్తుందని ఆశించారు. కానీ జగన్ ఛాన్స్ ఇవ్వలేదు. చీఫ్ విప్ పదవి ఇచ్చినట్టే ఇచ్చి తొలగించారు. దీంతో రాజకీయాలపైనే ఆయన ఎక్కువగా మొగ్గు చూపలేదు. జగన్ వైఖరి నచ్చక రాజకీయాల నుంచి బయటకు వెళ్లిపోవాలని చూస్తున్నారు. ప్రస్తుతానికి వైసిపి కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. అయితే ఈ నలుగురు నేతల వైఖరి తెలియక వైసీపీ హై కమాండ్ సతమతమవుతోంది.




# ఝాన్సీ ఆసుపత్రి ఘటనలో కీలక విషయాలు

లఖ్‌నవూ: ఉత్తర ప్రదేశ్‌లో ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కళాశాలలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో మంటలు వ్యాపించి పది మంది శిశువులు సజీవదహనం అయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్న సమయంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దుర్ఘటనకు ఓ నర్సు నిర్లక్ష్యమే కారణమని ప్రత్యక్ష సాక్షి ఒకరు ఆరోపించారు. హమీర్‌పూర్‌కు చెందిన భగవాన్ దాస్ అనే వ్యక్తి కుమారుడు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నాడు. ఘటన జరిగిన సమయంలో భగవాన్ దాస్ అక్కడే ఉన్నాడు. యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ నర్సు ఆక్సిజన్ సిలిండర్ పైప్‌ను కనెక్ట్ చేస్తున్న సమయంలో దానిపక్కన మరో నర్సు అగ్గిపుల్ల వెలిగించిందని అందువల్లే ప్రమాదం జరిగిందని అతడు తెలిపాడు. అది ఆక్సిజన్ అధికంగా ఉన్న ప్రదేశం కావడంతో క్షణాల్లో మంటలు చుట్టుముట్టాయని.. వెంటనే నలుగురు పిల్లలను తన మెడకు బట్టలో చుట్టుకొని బయటకు పరిగెత్తానని అన్నాడు. ఇతరుల సాయంతో మరికొంతమంది చిన్నారులను కాపాడగలిగామన్నాడు. మంటలు వ్యాపించి.. దట్టంగా పొగలు కమ్ముకోవడంతో ఆసుపత్రిలో ఉన్నవారు భయంతో పరుగులు తీశారని.. దానివల్ల తొక్కిసలాట జరిగి అనేకమంది గాయాలపాలయ్యారని పేర్కొన్నాడు. అయితే మంటలు అంటుకున్న సమయంలో సేఫ్టీ అలారాలు మోగకపోవడం, వార్డులో గడువు ముగిసిన అగ్నిమాపక పరికరాలు ఉండడంతో అందరు చిన్నారులను రక్షించలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ స్పందిస్తూ అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని.. చిన్నారుల మరణాలకు కారణమైన వారిని వదిలిపెట్టమని అన్నారు. శుక్రవారం రాత్రి ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కళాశాలలోని శిశువులకు చికిత్స అందించే ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన జరిగిన సమయంలో వార్డులో 47 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. మంటలు అంటుకున్న వెంటనే తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకొని బయటకు పరుగెత్తారు. ఆసుపత్రిలో ఉన్న గర్భిణులను వారి బంధువులు క్షేమంగా బయటకు తరలించారు. అయితే మంటల్లో చిక్కుకున్న పదిమంది చిన్నారులు సజీవదహనం అయ్యారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50వేల పరిహారం ఇస్తామని తెలిపారు.

# వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిపై సెర్చ్ వారెంట్



పులివెందుల: వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిపై పోలీసులు సెర్చ్ వారెంట్ జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ జిల్లా లింగాల మండలం అంబకపల్లిలోని రాఘవరెడ్డి ఇంటికి పులివెందుల పోలీసులు నోటీసు అంటించారు. ఏ క్షణంలోనైనా ఇంట్లో సోదాలు చేయడానికి అనుమతి తీసుకున్నామని వారు తెలిపారు.

వారం రోజుల నుంచి రాఘవరెడ్డి పరారీలో ఉన్నాడు. మరోవైపు వైకాపా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వివేకానంద రెడ్డికి పోలీసుల 41-ఎ నోటీసులు జారీ చేశారు. వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇచ్చిన కంటెంట్‌నే తాను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశానని వర్రా రవీందర్‌రెడ్డి ఇటీవల పోలీసులకు తెలిపారు. ఈ మేరకు రాఘవరెడ్డి కోసం అతడి స్వగ్రామం అంబకపల్లెలో నిఘాపెట్టి, పులివెందుల, లింగాల మండలాల్లో గాలిస్తున్నారు.

# ట్రోలర్స్‌పై కఠిన చర్యలు తీసుకోండి: స్పీకర్‌కు ఎమ్మెల్యే వాసు విజ్ఞప్తి



అమరావతి: రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని సోషల్ మీడియాలో ట్రోల్ చేసి వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో శూన్యగంట సమయంలో స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో భవానీ అప్పట్లో మాట్లాడిన వ్యాఖ్యల్నే ట్రోల్ చేశారని, గత స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినా.. స్పందించలేదన్నారు. ఇదే సమయంలో గత ఐదేళ్లలో దిశ చట్టం పేరిట జరిగిన దుర్వినియోగంపైనా విచారణ జరిపించాలని వాసు కోరారు.

**'సోషల్' సైకోల వల్ల ఇబ్బంది: గౌతు శిరీష..** సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారికి శిక్ష పడేలా చట్టాలను సవరించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శాసనసభలో జీరో అవర్‌లో మాట్లాడిన ఆమె.. అధికారంలో ఉండి కూడా సోషల్ మీడియా పోస్టుల వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తెదేపా వాళ్లనే కాకుండా.. అన్ని పార్టీల నేతలనూ సోషల్ మీడియా సైకోలు ఇబ్బంది పెడుతున్నారని సభాపతి దృష్టికి తీసుకెళ్లారు.

# జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా తయారైందని వ్యాఖ్య.. రిప్లై ఇచ్చిన మంత్రి అచ్చెన్న



అమరావతి: జీరో అవర్‌పై ఏపీ శాసనసభలో వాదోపవాదాలు జరిగాయి. జీరో అవర్ డ్రైవర్ లేని కారులా తయారైందని తెదేపా ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు.

సమస్యలను మంత్రులెవరు రాసుకుంటున్నారో తెలియడం లేదని ఆరోపించారు. దీంతో సమస్యలను తాను రాసుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిచ్చారు. పరిష్కరించిన తర్వాత సభ్యులకు సమాచారమిస్తామని చెప్పారు. మరోవైపు కూన రవి కుమార్ ఆఖరి వరుసలో కూర్చోవడం వల్ల ముందు జరిగేది తెలియడం లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చమక్కులు విసిరారు.

# వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌లో బోరుగడ్డ అనిల్ విచారణ



ఏలూరు: ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కుటుంబంపై అసభ్య దూషణలు చేసిన వైకాపా నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు విచారిస్తున్నారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం వరకు విచారణ కొనసాగనుంది. రెండు నెలల క్రితం ఉద్దగిరి రాణి అనే మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అరెస్టయిన అనిల్‌ను విచారణ కోసం వేలేరుపాడు పోలీసులు కస్టడీకి కోరగా.. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం జైలు నుంచి వేలేరుపాడుకు అతడిని తరలించారు.

# క్షుద్ర పూజల కలకలం.. పోలీసుల అదుపులో వైసీపీ నేత..




ఏపీలో క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. ఓ వైసీపీ కీలక నేత తన బృందంతో కలిసి క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తుంది. అయితే, ఆ వైసీపీ నేత ఎవరూ? ఎందుకోసం క్షుద్ర పూజలు చేశాడు. అసలేం జరిగింది? అనే విషయాలను తెలుసుకుందాం..

**కార్తీక పౌర్ణమి సందర్భంగా..** అన్నమయ్య జిల్లా బి. కొత్తకోట మండలంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా మదనపల్లి పోలీసుల అదుపులో ఉన్నారు. బి కొత్తకోట మండలంలో శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తుంది. మదనపల్లికి చెందిన ఓ వైసీపీ నేతతో కలిసి వజ్ర భాస్కర్ రెడ్డి క్షుద్రపూజల్లో పాల్గొన్నట్లు సమాచారం.

**రహస్యంగా...** వజ్ర భాస్కర్ రెడ్డితో పాటు మదనపల్లి వైసీపీ నేతను పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు. వజ్రభాస్కర్ రెడ్డి కదిరికి చెందిన కీలక వైసీపీ నేత కావడంతో కేసును పక్కదోవ పట్టించే యత్నం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఎవరైనా కూడా శత్రువుల వినాశనం వెంటనే జరగాలని కోరుతూ క్షుద్ర పూజలు చేస్తారు. మరీ వైసీపీ నేత వజ్ర భాస్కర్ రెడ్డి నిజంగా గుప్త నిధుల కోసమే క్షుద్ర పూజలు చేశారా? లేదంటే ఎవరి నాశనమైనా కోరుతూ చేశారా? అనే అనుమానం కలుగుతుంది.

# చెలరేగి ఆరబోసిన 'హీరామండి'!

కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన హీరామండిలో ఒక వేశ్య పాత్రలో నటించింది సంజీదా షేక్. తన కంటే సీనియర్ నటీమణులతో పోటీపడి మరీ నటించింది. తనదైన అందం, నటనాభినయంతో మంత్రముగ్ధులను చేసింది ఈ బ్యూటీ. ఈ సినిమా కంటే ముందే బుల్లితెరపైనా ఈ భామకు నటిగా అనుభవం ఉంది. హీరామండి నటి సంజీదా షేక్ వ్యక్తిగత జీవితం కూడా సోషల్ మీడియాల్లో డిబేటబుల్ ఎలిమెంట్. ఈ బ్యూటీ ఒంటరి తల్లి. భర్తకు విడాకులిచ్చాక తన కూతురితో కలిసి నివశిస్తోంది. ఇటీవల తన మాజీ భర్త, నటుడు అమీర్ అలీ గురించి సంజీదా ఓపెన్ గా మాట్లాడారు. 2012లో పెళ్లయింది. వారికి ఐరా అలీ అనే కుమార్తె కూడా ఉంది. కానీ మనస్పర్థలతో సంజీదా- అమీర్ అలీ 2021లో విడిపోయారు. సంజీదా షేక్ తన జీవితంలోని సవాళ్లు, దుఃఖాన్ని అధిగమించానని, డిప్రెషన్ నుంచి బయటపడ్డానని కూడా తెలిపింది.



మిమ్మల్ని డిమోటివేట్ చేయడానికి ప్రయత్నించే భాగస్వాములు ఉన్నారు.. మీరు ఏమీ చేయలేరని మీకు చెప్తారు. లేదా మీరు దీన్ని చేయలేరు అంటారు. అలాంటి వారికి దూరంగా ఉండటం మంచిది. మీరు సంతోషంగా ఉన్న ప్రతి సంబంధంలో కొన్ని దశలు ఉంటాయి. ఆ దశలు దాటితే ఏం చేయాలో నిర్ణయించుకోండి. నేను నా కోసం విడిపోయాను. ఎందుకంటే నేను నన్ను ప్రేమించడం ప్రారంభించాను. నాకే ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాను. ఇది చాలా చాలా ముఖ్యమైనది! అని సంజీదా షేక్ బ్రేకప్ గురించి మాట్లాడారు. ఒంటరి తల్లిగా ఉండటం ఎలా అనిపిస్తుంది? అని ప్రశ్నిస్తే... ఒంటరి తల్లి అంటే ఏమిటి? అని ఎదురు ప్రశ్నించారు. నేను ఒక తల్లిని. ఒక తల్లి తల్లి అని నేను అందరికీ చెప్తాను. ఒంటరిగా ఉందా లేదా అనేది పట్టింపు లేదు. నా బాధ్యతలు మారవు. ఒక తల్లిగా నేను ఏమి చేయాలో అది చేస్తాను అని అంది. హీరమండికి ముందు ఫైటర్‌లో హృతిక్ రోషన్, దీపికా పదుకొనే లతో కలిసి కనిపించింది. జానే పెహచానే సే యే అజ్నాబి, బదల్తే రిష్టన్ కి దస్తాన్, ఇష్క్ కా రంగ్ సఫేద్ వంటి అనేక టీవీ షోలలో కనిపించింది. సోషల్ మీడియాల్లోను సంజీదా షేక్ యాక్టివ్ గా ఉన్నారు. సంజీదా తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ లో గుబులు పెంచుతోంది. ఈ భామ గ్లామరస్ ఫోటోషూట్ వెబ్ ని వేడెక్కిస్తోంది.

# పచ్చ కోకలో జిల్లనిపించిన సోఫీ

లండన్ బాబులు లండన్ బాబులు అంటూ ఐటమ్ పాటతో మెప్పించింది సోఫీ చౌదరి. 1-నెనొక్కడినేలో స్పెషల్ నంబర్ లో తనదైన వయ్యారంతో మురిపించిన బాలీవుడ్ నటి సోఫీ చౌదరి ఆ తర్వాత తెలుగు పరిశ్రమలో కనిపించలేదు. ప్రస్తుతం బాలీవుడ్ లో కూడా తన కెరీర్ అంతంత మాత్రమే. టీవీ షోలు యోగా సెషన్‌లు అంటూ సోఫీ సోషల్ మీడియాల్లో కొంత హడావుడి చేస్తుంది కానీ, ఆ రకంగానూ అంతగా ఫేమ్ లేదు. నలభై పైగా ఏజ్ తో ఉన్న ఈ బ్యూటీకి అవకాశాలు జీరో అయిపోయాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు టెంప్టింగ్ ఫోటోషూట్లతో హీటెక్కిస్తుంది. తాజాగా సోఫీ పచ్చ రంగు డిజైనర్



చీర, రవికెలో మతులు చెడగొట్టింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. సోఫీ అందచందాలు మతులు చెడగొడుతున్నాయంటూ యూత్ కామెంట్ చేస్తున్నారు. సోఫీ స్టన్నింగ్ దీవాళీ లుక్ కి ఫిదా అయిపోయామంటూ కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక సోఫీ బాలీవుడ్ ఎంట్రీ విషయానికి వస్తే 15 ఏళ్ల క్రితమే షాది నెంబర్ 1 సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ప్యార్ కి సైడ్ ఎఫెక్ట్స్.. ఐ సీయూ సహా చాలా చిత్రాల్లో నటించింది. ఎక్కువగా ఆమె ఫోకస్ అయింది ఐటం గాళ్ల్ గానే. కానీ ఆ రకంగా ఆమె కెరీర్ సాపీగా సాగలేదు. అవకాశాలు రావడం..మధ్యలో బ్రేకులు ఇలా మొత్తం కెరీర్ నత్తనడకనే సాగింది. దశాబ్ధ కాలంగా సరైన అవకాశాల్లేక ఇబ్బంది పడుతోంది.





# ఫస్ట్ సింగిల్ అప్డేట్.. 'బుజ్జి తల్లి' ప్రేమ కౌగిలిలో 'తండేల్' రాజు!




యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "తండేల్". చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామాలో నేచురల్ బ్యూటీ సాయి పల్లవి హీరోయిన్ గా నటించింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్, టీజర్ లకు ఆడియన్స్ నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఇటీవలే రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేసిన మేకర్స్.. మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభించడానికి రెడీ అయ్యారు. తాజాగా ఫస్ట్ ఫస్ట్ సింగిల్ అప్డేట్ అందించారు. 'తండేల్' సినిమాలోని 'బుజ్జి తల్లి' అనే పాటను ఈ నెల నవంబర్‌లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించారు. ఈ సందర్భంగా 'ఇది మీ హృదయాలను తాకే ప్రేమ కెరటంలా ఉంటుంది' అంటూ ఓ బ్యూటిఫుల్ సాంగ్ పోస్టర్ ను పంచుకున్నారు. ఇందులో సాయి పల్లవి నాగ చైతన్యను ఆప్యాయంగా కౌగిలించుకుని కనిపిస్తోంది. చైతూ పేస్ కనిపించనప్పటికీ, ఈ ఫోటో ఇద్దరి మధ్య గాఢమైన ప్రేమ బంధాన్ని తెలియజేస్తోంది. ఇది హీరో హీరోయిన్ల మధ్య డీప్ ఎమోషనల్ కనెక్షన్ ను సూచిస్తోంది. 'తండేల్' మూవీకి నేషనల్ అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ కంపోజర్ రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. 'బుజ్జి తల్లి' సాంగ్ కోసం ఒక బ్యూటిఫుల్ రొమాంటిక్ మెలోడీ ట్యూన్ ని కంపోజ్ చేసినట్లు తెలుస్తోంది. నవంబర్ 23న నాగచైతన్య బర్త్ డే స్పెషల్ గా ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేసే అవకాశం ఉంది. ఆల్రెడీ బయటకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాకి మంచి బజ్ తెచ్చిపెట్టింది. డీఎస్పీ ఈ చిత్రానికి చార్ట్ బస్టర్ ఆల్బమ్ ఇచ్చారని, కచ్చితంగా సినిమా మ్యూజికల్ హిట్ అవుతుందని ఇన్సైడ్ టాక్ వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలోని డి. మచ్చిలేశం గ్రామంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'తండేల్' సినిమా రూపొందుతోంది. ఇది లవ్, యాక్షన్, డ్రామా, అడ్రినలిన్ మూమెంట్స్ యొక్క అద్భుతమైన సమ్మేళనంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. 'లవ్ స్టోరీ' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాగచైతన్య - సాయి పల్లవి కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'తండేల్' చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్ పై బన్నీ వాస్ భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తుండగా.. శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7వ తేదీన వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా థియేటర్లలో విడుదల చేయనున్నారు.

# నందమూరి అభిమానులకు 2025 అతి పెద్ద పండగ!





ఒకేసారి ఇద్దరు నందమూరి వారసులు పరిచయం అవ్వడం అన్నది అభిమానులుకు అతి పెద్ద గుడ్ న్యూస్. అందులో నటసింహ బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఒకరైతే? హరికృష్ణ మనవుడు, జానకీ రామ్ కుమారుడు తారక రామారావు మరొకరు. ఇప్పటికే మోక్షజ్ఞ ఎంట్రీ చిత్రం ఖరారైంది. పాన్ ఇండియాలో సంచలనమైన ప్రశాంత్ వర్మకు తనయుడి బాధ్యతలు అప్పగించారు బాలయ్య. తొలి చిత్రమే భారీ బడ్జెట్ తో ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మఆ సినిమా పనుల్లోనే బిజీగా ఉన్నాడు. నందమూరి మాస్ ఇమేజ్ ని పక్కనబెట్టి మోక్షజ్ఞని తొలి సినిమాతో పాన్ ఇండియా మార్కెట్ కి కనెక్ట్ చేసేలా ముందుకెళ్తున్నాడు.

ఈ విషయంలో బాలయ్య ఎంతో తెలివిగా వ్యవరించారన్నది అర్ధమవుతుంది. ఇక హరికృష్ణ మనవడు తారకరామారావు కూడా హీరో మెటీరియల్. అందులో ఎలాంటి డౌట్ లేదు. అతడి లాంచింగ్ కోసం ఏకంగా వై.వీఎస్ చౌదరి రంగంలోకి దిగాడు. ఇప్పటికే తారకరామారావు ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రిలీజ్ అయింది. చూస్తుంటే అర్జున్ రెడ్డి ఫీల్ ని తీసుకొస్తున్నాడు. అతడిలో ఉన్న ఎనర్జీని చౌదరి పర్ఫెక్ట్ గా బయటకు తీయగలడు. అందులో ఎలాంటి డౌట్ లేదు. వారసులను పరిచయం చేయడంలో చౌదరి స్పెషలిస్ట్. మరి ఈసారి ఎలాంటి కంటెంట్ తో వస్తున్నాడు? అన్నది చూడాలి. అయితే ఈ రెండు విషయాలు నందమూరి అభిమానులు పండగ లాంటిందే. ఒకేసారి ఇద్దరు లాంచ్ అవ్వడం అన్నది డబుల్ ట్రీట్ అవుతుంది. హీరోలిద్దరు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఉయ్ ఆర్ వెయిటింగ్ అంటూ అభిమా నులు ఇప్పటినుంచే ఎదురు చూడటం మొదలు పెట్టారు. ఎన్టీఆర్ తర్వాత అదే ఫ్యామిలీ నుంచి బాలయ్య, హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ సహా కొంత మంది వచ్చారు. కానీ వీళ్లు సక్సెస్ అయినంతగా మిగతా వారు సక్సెస్ కాలేదు. అయితే ఆ రేంజ్ అంచనాలు మాత్రం మోక్షజ్ఞ, తారకరామారావుపై భారీగా ఉన్నాయి.

# వర్క్అవుట్‌లో జ్యోతిరాయ్ గ్లామర్ మెరుపులు

సోషల్ మీడియా లో తన గ్లామర్ ఫోటోలతో మంచి క్రేజ్ అందుకున్న బ్యూటీ జ్యోతి రాయ్. ఇక ప్రత్యేకంగా ఫిట్‌నెస్ ఫోటోలతో ఫాలోవర్స్ ని మంత్ర ముగ్ధులను చేస్తున్న జ్యోతి మరోసారి న్యూ లుక్ తో వార్తల్లో నిలిచింది. జిమ్ లో డంబెల్స్ తో పవర్ఫుల్ ఎక్స్‌ప్రెషన్ తో కనిపిస్తూ షేర్ చేసిన ఈ ఫోటో ఆమె ఫిట్‌నెస్ పట్ల ఉన్న ప్రతిజ్ఞను చాటుతోంది. కర్ణాటకకి చెందిన ఈ అందాల భామ, జ్యోతి రాయ్ గా సీరియల్ లలో నటిగా కెరీర్ స్టార్ట్ చేసింది.తెలుగులో పాపులర్ టీవీ సీరియల్ "గుప్పెడంత మనసు"లో ఆమె హీరో తల్లి పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సీరియల్ లో ఆమె క్యారెక్టర్ ప్రేక్షకులకు ఎంతో చేరువైంది. ఆమెకు ఈ సీరియల్ ద్వారా పాపులారిటీ పెరిగింది. సోషల్ మీడియా ద్వారా జ్యోతి పూర్వాజ్ తన గ్లామర్



ప్రెజెన్స్ తో యూత్ కి కొత్తగా స్ఫూర్తినిచ్చేలా మారింది. కెరీర్ లో ఆమె పలు సవాళ్లను ఎదుర్కొంటూ, యాక్టింగ్ స్కిల్స్ తో పాటు తన ఫిట్‌నెస్ పై కూడా చాలా కసరత్తులు చేస్తోంది.జ్యోతి పూర్వాజ్ తన వ్యక్తిగత జీవితం లో కూడా కొన్ని మార్పులను చేసుకుంది. టాలీవుడ్ యువ డైరెక్టర్ సుకు పూర్వాజ్ తో లివింగ్ రిలేషన్ లో కొంతకాలం ఉన్న తర్వాత అతనిని వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత తన పేరుని జ్యోతి పూర్వాజ్ గా మార్చుకుంది. పెర్ఫెక్ట్ ఫిట్‌నెస్ తో యంగ్ హీరోయిన్స్ కి పోటీగా నిలుస్తూ సోషల్ మీడియా ద్వారా ఫాలోవర్స్ ని ఆకట్టుకుంటోంది. అంతేకాకుండా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన గ్లామర్ పిక్స్ తో పాటు జిమ్ లో కసరత్తు చేస్తున్న ఫోటోలు పోస్ట్ చేస్తూ ఫిట్‌నెస్ పై ఉన్న ఆసక్తిని చాటుతోంది.

ఇక ఆమె కెరీర్ విషయానికి వస్తే ఎక్కువగా టెలివిజన్ ప్రపంచంలోనే బిజీగా మారుతోంది. గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా జ్యోతి కెరీర్ ఒక్కసారిగా యూ టర్న్ తీసుకుంది. ఇక కొన్ని చిన్న సినిమాల్లో కూడా నటించింది. ప్రస్తుతం కన్నడ లో ఒక లేడి ఓరియెంటెడ్ సినిమా చేస్తున్నట్లు సమాచారం.

# ఐడెంటిటీని మార్చుకోవాలని నటి భర్త కండీషన్!

80లు, 90లలో అందరికి ఇష్టమైన ప్రముఖ హీరోయిన్. సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, గోవిందా వంటి అగ్ర హీరోలతో కలిసి పనిచేసింది. అనూహ్యంగా ఓ వివాదాస్పద కేసులో ఆమె పేరు వినిపించడంతో సడెన్ గా అందరి దృష్టిని ఆకర్షించింది. అటుపై నటన విరమించాక నగల డిజైనింగ్ వైపు మళ్లింది. ఇదంతా ఎవరి గురించి? అంటే... పాపులర్ సీనియర్ కథానాయిక నీలం కొఠారి సోనీ గురించి. ఆమె 1984లో 15 ఏళ్ల వయసులో జవానీ చిత్రంలో తొలిసారిగా నటించింది. దీని తర్వాత లవ్ 86, ఇల్జామ్, సిందూర్, ఖుద్గర్జ్, హత్య, ఫర్జ్ కి జంగ్, బిల్లూ బాద్షా, ఆగ్ హీ ఆగ్ వంటి సినిమాల్లో నటించింది. సూరజ్ బర్జాత్యా హమ్ సాథ్ సాథ్ హై.. కరణ్ జోహార్ -కుచ్ కుచ్ హోతా హైలో అతిథి పాత్రతోను మెప్పించింది. ఇంతలో బాలీవుడ్‌లో నీలం చివరి చిత్రం 2001లో విడుదలైన కసమ్. 2020లో నెట్‌ఫ్లిక్స్‌లో ఫ్యాబులస్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైవ్స్ అనే డ్రామా రియాలిటీ సిరీస్‌తో తిరిగి అభిమానుల ముందుకు వచ్చింది. ఆ తర్వాత నటనకు దూరమై నగల డిజైనింగ్ వైపు మొగ్గు చూపింది. నాలుగు తరాల నగల వ్యాపారుల కుటుంబం నుండి



వచ్చిన నీలం గత సంవత్సరం నేచురల్ డైమండ్స్ డాట్ కామ్‌తో మాట్లాడింది. నటనకు స్వస్తి చెప్పి కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టాలనే తన నిర్ణయం గురించి కూడా చెప్పుకొచ్చింది. ప్రతిదానికీ షెల్ఫ్ లైఫ్ ఉన్నట్లే, ఆశించిన అవకాశాలు తగ్గిపోవడంతో నటనకు వీడ్కోలు చెప్పే సమయం వచ్చిందని .. నా జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని నాకు తెలుసు అని అంగీకరించింది. అదృష్టవశాత్తూ నాకు బ్యాకప్ ప్లాన్ ఉంది అని కొఠారి చెప్పారు. తన తండ్రి నుండి వజ్రాల గురించి ప్రతిదీ నేర్చుకున్నట్లు అంగీకరించింది. ఆమె ప్రయోగాత్మకంగా శిక్షణ పొందుతున్నప్పుడు తన అభిరుచిని మెరుగుపరుచుకున్నానని తెలిపింది. సూరజ్ బర్జాత్యా - హెచ్ఎస్ఎస్‌హెచ్ షూటింగ్ సమయంలో సల్మాన్, టబు, సైఫ్ అలీ ఖాన్ , సోనాలి బింద్రేలతో పాటు 1998 కృష్ణజింకలను వేటాడిన కేసులో ఆమె పేరు కూడా వినిపించింది. ఈ కేసువల్ల నీలం పేరు మార్మోగింది. నీలం గతంలో రిషి సేథియాను వివాహం చేసుకుంది. 2000లో వివాహం చేసుకున్న తర్వాత ఈ జంట అక్టోబర్ 2000లో విడాకులు తీసుకున్నారు. FLOBW మూడవ సీజన్‌లో భారతీయ దుస్తులను ధరించమని .. నాన్ వెజ్ ,ఆల్కహాల్ మానేయమని అతడు చెప్పినట్లు నీలం వెల్లడించింది. ఆమె అన్నింటికీ ఓకే చెప్పినా కానీ, ఆమె ఐడెంటిటీని కూడా మార్చమని అడిగాడని తెలిపింది. తరువాత సమీర్ సోనీలో మళ్లీ ప్రేమను కనుగొని 2011లో అతనిని వివాహం చేసుకుంది. ఈ జంట 2013లో ఒక కుమార్తెను దత్తత తీసుకున్నారు. ఆమెకు వారు అహానా అని పేరు పెట్టారు.



## హైదరాబాదీల చైతన్యానికి శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నా : కేటీఆర్

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు చూపించిన చైతన్యానికి శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 24 నియోజకవర్గాల్లో ఒక్క సీటు ఇతర పార్టీలకు ఇవ్వకుండా బీఆర్ఎస్ పార్టీని గెలిపించడం గొప్ప విషయమని కేటీఆర్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఇవాళ హైదరాబాద్ ప్రజల చైతన్యానికి శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నా. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో కొందరు మోసపోయారు. కానీ హైదరాబాద్ వాళ్ళు మాత్రం మోసపోలేదు. కాంగ్రెసోళ్ల మాటలు, వ్యవహారం తెలుసు కాబట్టి.. 24 నియోజకవర్గాల్లో మీ చైతన్యాన్ని చూపించారు. రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే పశ్చాత్తప పడే రోజు వస్తది. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి. మీరు గెలిపించిన ఎమ్మెల్యే రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నాడు తప్ప మీరు తప్పు చేయలేదు. మీరంతా పార్టీని వెన్నంటే ఉన్నారు. పార్టీలో ఇవాళ కార్తీక్ రెడ్డి పోరాట పటిమ ప్రదర్శిస్తున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు. మీ అందరితో ప్రార్థన ఒక్కటే.. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు సేవ చేసే భాగ్యం కలుగుతుంది. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరపున కొట్లాడి ప్రజల గుండెల్లో శాశ్వతంగా స్థానం సంపాదించుకునే అరుదైన అవకాశం ఉంటుంది. ఆ అవకాశం కార్తీక్ రెడ్డికి వచ్చింది. ఎంత గట్టిగా ప్రజల్లోకి పోతే.. అంత మేలు జరుగుతుంది. కార్తీక్ రెడ్డి.. మూసీ ప్రాజెక్టు వల్ల ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. దాదాపు ఐదారు వందల కుటుంబాలను కలిశాం. హిందూ ముస్లిం అనే తేడా లేకుండా.. మాకు ఎవరు మేలు చేస్తారో ఎవరు చేయరో అర్థం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏండ్ల నుంచి ఇండ్లు కట్టుకున్నాం.. ఇప్పుడేమో కబ్జాదారులు అని అంటున్నారు. అన్ని ట్యాక్స్‌లు కడుతున్నాం. కట్టంగా కూడా ఇవాళ దొంగలు, ఆక్రమణదారులు అని బద్నాం చేస్తున్నారని వారు వాపోయారు. బంగారం లాంటి భూమిని విడిచిపెట్టి పోవాలని కాంగ్రెసోళ్లు బెదిరిస్తున్నారు. కోట్ల ఆస్తి మా పిల్లలకు ఉండిపోతది అనుకుంటే.. ఈ దుర్మార్గుడు ఇట్లా చేస్తాడని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారని కేటీఆర్ తెలిపారు.




వికారాబాద్: లగచర్లలో అధికారులపై దాడి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. తాజాగా మరో 8 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరిని పరిగి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు.

ఈ కేసులో ఇప్పటికే 17 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చర్లపల్లి జైలులో ఉన్నారు, మిగతా 16 మందిని పరిగి నుంచి సంగారెడ్డి జైలుకు తరలించారు. మరోవైపు లగచర్ల ఘటనపై వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీ మహేశ్ భగవత్ వివరాలు సేకరిస్తున్నారు. లగచర్లతో పాటు పరిసర గ్రామాల్లో పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

## సీఎం రేవంత్ కారు తనిఖీ.. ఎందుకంటే



హైదరాబాద్/మహారాష్ట్ర, నవంబర్ 16: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారును పోలీసులు తనిఖీ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రపూర్ నియోజవర్గంలోని గూగుల్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వెళ్తుండగా రేవంత్ వాహనాన్ని మహారాష్ట్ర పోలీసులు తనిఖీ చేశారు.

కాగా.. ఈరోజు ఉదయం సీఎం రేవంత్ మహారాష్ట్రకు బయలుదేరి వెళ్లారు. ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో నాగపూర్‌కు వెళ్లారు. రెండు రోజుల పాటు మహారాష్ట్రలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈరోజు చంద్రాపూర్‌లో ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం చేయనున్నారు. అనంతరం రాజురా, డిగ్రాస్, వార్ధా నియోజకవర్గాల్లో తెలంగాణ సీఎం ప్రచార సభలు, రోడ్ షోలు నిర్వహిస్తారు. రాత్రి నాగ్‌పూర్‌లోనే బస చేస్తారు. రేపు (ఆదివారం) ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్‌కు వెళ్లనున్నారు. నయగావ్, భోకర్, షోలాపూర్? నియోజకవర్గాల్లో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

## వచ్చే ఎన్నికల నాటికి భారాస ఉండదు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: భారాస ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేకపోయిందని.. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పదేళ్లలో తెలంగాణలో అభివృద్ధి జరగలేదని.. కేవలం దోపిడీనే జరిగిందన్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలనను అందిస్తున్నామన్నారు. ఈ మేరకు హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. "సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించడంలో భారాస పూర్తిగా విఫలమైంది. అధికారం కోల్పోయామనే అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి భారాస ఉండదు. పదేళ్లలో భారాస ఇచ్చిన ఉద్యోగాల కన్నా ఏడాది వ్యవధిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కువ. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. మిగతా రాష్ట్రాల్లోనూ తెలంగాణ తరహా పథకాలు కావాలని అడుగుతున్నారు. కులగణనతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. సంక్షేమం, అభివృద్ధిలో భారాస నేతలతో చర్చకు సిద్ధం. అన్ని రకాలుగా ప్రజలను మెప్పించాం. అందుకే విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. వరంగల్ విజయోత్సవ సభకు 'ఇందిరా మహిళా శక్తి సభ'గా నామకరణం చేశాం" అని తెలిపారు.

## ట్రంప్ ఎన్నిక..అమెరికాకు మంచిదే: జై శంకర్

ఢిల్లీ: అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ పాలనలో అమెరికా మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర విదేశాంగమంత్రి జై శంకర్ పేర్కొన్నారు. ఆయన ఎన్నికతో యూఎస్ ఆర్థిక, తయారీ రంగాల్లో మరిన్ని ప్రయోజాలు పొందుతుందని తెలిపారు. ప్రపంచీకరణ అంశంపై ఓటర్లలో ఉన్న అసంతృప్తి అమెరికా ఎన్నికల్లో కనిపించిందన్నారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో జైశంకర్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచీకరణ వల్ల చైనా ఇతర దేశాల కంటే అధికంగా లబ్ధి పొందుతుందని ఆయన అన్నారు. క్లింటన్ పరిపాలనలో మొదట దీనిని అవలంభించారని పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల యూఎస్, భారత్ సహా ఇతర దేశాల్లో అనిశ్చితి నెలకొందని వెల్లడించారు. అమెరికా ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశమయినప్పటికీ.. దానికి ప్రపంచ భాగస్వామ్య దేశాల మద్దతు అవసరమని అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ భద్రత గురించి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికత, జాతీయ భద్రతను విభజించలేమని.. డిజిటల్, ఏఐ విప్లవంలో ఇది భాగమని అన్నారు. భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు ప్రపంచం చూస్తోందని జైశంకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాలు రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్నాయని.. ఈ సమయంలో భారత్‌లో ఉన్న రాజకీయ సుస్థిరతను అవి గమనిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో మళ్లీ ఎన్నికవడం అంత సులభం కాదని.. అయినా తమ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు మూడోసారీ ఎన్డీఏకు పట్టం కట్టారని.. ఇది మామూలు విషయం కాదన్నారు. 7-8 శాతం వృద్ధి రేటును కొనసాగించడం ఇతర దేశాలకు సవాలుగా మారిందని జైశంకర్ పేర్కొన్నారు. దీంతో ప్రపంచదేశాలు భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు చూస్తున్నాయని.. భారత్‌లో వ్యాపారాలు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయన్నారు.




భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్థానీ వేర్పాటువాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ దల్లా ను కెనడా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడిని తమకు అప్పగించాలని ఇటీవల కెనడా ను భారత్ కోరింది. ఈ విషయంపై కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలానీ జోలీ స్పందిస్తూ అతడిని అప్పగించే విషయంపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పెరూలోని లిమాలో జరిగిన ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వార్షిక మంత్రివర్గ సమావేశంలో మెలానీ జోలీ మాట్లాడుతూ ప్రస్తుతం అర్ష్ దల్లా కేసులో విచారణ జరుగుతోందని..కాబట్టి ఆ విషయంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని అన్నారు. అతడికి సంబంధించి ఏవైనా విచారణలు చేయాల్సి ఉంటే భారత దౌత్యవేత్తలతో చర్చలు జరుపుతామని తెలిపారు. అక్టోబరు 27, 28న మిల్టన్ పట్టణంలో కాల్పులు జరిపిన ఘటనలో సింగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన కెనడా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లాపై భారత్‌లో హత్య, వేధింపులు, అపహరణ సహా పలు కేసులు ఉన్నాయి. గతేడాది జనవరిలో భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పెద్ద మొత్తంలో డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్‌లో ఇతడి పాత్ర ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ కూడా తెలిపింది.

దల్లాకు సంబంధించిన పలుకేసులను జాతీయ విచారణ సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఖలిస్థానీ ఉగ్రవాది, గుర్తు తెలియని వారి కాల్పుల్లో హతమైన నిజ్జర్‌కు దల్లా సన్నిహితుడు.

## దేశంలోనే తొలి 'మహిళా' బస్ డిపో ప్రారంభం



ఢిల్లీ: దేశంలోనే తొలి 'మహిళా' బస్ డిపోను రాష్ట్ర రవాణా మంత్రి కైలాశ్ గహ్లోత్ ఢిల్లీలో ప్రారంభించారు. ఢిల్లీలోని సరోజిని నగర్‌లో పూర్తిస్థాయి మహిళా సిబ్బందితో కూడిన ఈ డిపోకు సఖి డిపో అని పేరు పెట్టినట్లుగా పేర్కొన్నారు. ఇందులో డిపో మేనేజర్, డ్రైవర్లు, కండక్టర్లు ఇలా సిబ్బంది అంతా మహిళలే అని..దీని కోసం మొత్తం 225 మంది సిబ్బందిని కేటాయించామని ఆయన తెలిపారు. అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్న మహిళలు రవాణా రంగంలోనూ తమ హక్కులను పొందాలనే ఉద్దేశంతో ఈ డిపోను ప్రారంభించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే చాలామంది మహిళలు బస్ కండక్టర్లుగా, ఇతర సిబ్బందిగా తమ సేవలు అందిస్తున్నారని..ఇకపై డ్రైవర్లుగానూ తమ ప్రతిభను చాటుకుంటారని అన్నారు. దేశంలో ఇది ఒక కొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**నిరసన తెలిపిన మహిళా ఉద్యోగులు :** కాగా దేశంలోనే తొలి 'మహిళా' బస్ డిపోను ప్రారంభించడం మంచిదే అయినా.. ప్రస్తుతం రవాణా రంగంలో పని చేస్తున్న తమకు సరైన సౌకర్యాలు లేవని మహిళా ఉద్యోగులు మంత్రి ఎదుట నిరసన చేపట్టారు. ఫిక్స్‌డ్ జీతం, పర్మినెంట్ ఉద్యోగాలకు మంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విధులకు హాజరు కావాలంటే ఉదయం 6 గంటలకే ఇళ్ల నుంచి బయల్దేరి..కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలని..అయినా ఒక్కోసారి సమయానికి పని ప్రదేశానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మహిళా ఉద్యోగులతో మాట్లాడిన మంత్రి కైలాశ్ గహ్లోత్ వారి డిమాండ్లు నెరవేరుస్తామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## విషాదం వేళ డిప్యూటీ సీఎంకి వీఐపీ ట్రీట్‌మెంట్.. విపక్షాలు ఫైర్!



ఝాన్సీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లా మహారాణి లక్ష్మీబాయి వైద్య కళాశాల ఆస్పత్రిలో జరిగిన ఘోర ప్రమాదం కలకలం రేపింది. ఈ ఘటనలో అభంశుభం తెలియని 10 మంది చిన్నారులు మృత్యువాత పడ్డారన్న వార్త కోట్లాది హృదయాలను కలచివేసింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. ఈ విషాదం వేళ ఆస్పత్రికి వర్గాలు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ రాకకు ముందు ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేసి, సున్నం చల్లడంపై కాంగ్రెస్ పార్టీ అధికార భాజపాపై విమర్శలు గుప్పించింది. సంబంధిత వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. "అగ్నిప్రమాదంలో చిన్నారులు మృత్యువాత పడి.. బాధిత కుటుంబాలు గుండెలవిసేలా రోధిస్తుంటే.. డిప్యూటీ సీఎం రాక కోసం సాదర స్వాగతం పలికేందుకు రోడ్లు శుభ్రం చేసి, సున్నం చల్లుతున్నారు" అంటూ కాంగ్రెస్ సంబంధిత వీడియోను పోస్ట్ చేసింది. అప్పటి వరకు మురికి కూపంలా ఉన్న ఆస్పత్రి ఆవరణను డిప్యూటీ సీఎం రాక వేళ శుభ్రం చేశారని స్థానికులు పేర్కొన్నట్లు తెలిపింది. విషాదం వేళ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఇదీ అంటూ మండిపడింది. చిన్నారుల మరణం కంటే తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని మండిపడింది. యూపీలోని ప్రభుత్వ ఆస్పత్రులు అవినీతికి, నిర్లక్ష్యానికి నిలయాలుగా మారాయని మరో విపక్ష పార్టీ సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. చిన్నారులను రక్షించడానికి ఆస్పత్రిలో ఎలాంటి ఏర్పాట్లూ లేవని ఆరోపించింది. ప్రజలు చనిపోతున్నా ఆ పార్టీకి ఏమీ పట్టదంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధి జూహీ సింగ్ విమర్శించారు. ఈ ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారణకు ఆదేశించారు.

## రేవంత్ పాలనకు పరాకాష్ట లగచర్ల ఘటన : సత్యవతి రాథోడ్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనకు పరాకాష్ట లగచర్ల ఘటన అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. లగచర్ల బాధితులతో కలిసి బీఆర్ఎస్ నేతలు కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను శనివారం కలిశారు. కమిషన్ చైర్మన్‌కు పిటిషన్‌ను సమర్పించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన నేతలు కోరారు. అనంతరం సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. కలెక్టర్, అధికారులపై దాడి చేశారని అమాయకులైన రైతులపై అక్రమ కేసులు పెట్టారని, దాడి చేశారని మండిపడ్డారు. రేవంత్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమి మాత్రమే ఉందా ? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారం , దూరంకారం గిరిజనులపై చూపిస్తున్నాడని మండిపడ్డారు. భూమిపుత్రుల భూములను గుంజుకొనే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. వారి కడుపుకాలి తిరగపడితే వారిపై హత్యాయత్నం కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫార్మా సిటీ ప్రయత్నాన్ని విరమించుకొని.. గిరిజనులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తున్నామని.. కానీ, ఒక కలెక్టర్ అక్కడికి వెళ్తే ఒక్క పోలీస్ అధికారి లేకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇంటలిజెన్స్ ఏమైంది ? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా కక్ష రాజకీయాలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.

**దాడులు చేసిన పోలీసులపై కేసులు పెట్టాలి : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ :** లగచర్లలో దాడి జరిగింది అధికారులపై కాదని.. గిరిజన ప్రజల మీద అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. గిరిజన మహిళలపై దాడులు చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాలని కమిషన్‌ను కోరారు. గిరిజన ప్రజలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ న్యాయం చేస్తుందని నమ్ముతున్నామన్నారు. గిరిజన ప్రజల పై లైంగిక దాడులు చేశారని మహిళలు చెపుతున్నారని.. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీకి కమిషన్ వ్యతిరేకం కాదన్నారు. భూములు కోల్పోతున్న గ్రామస్తులు తమను కలిశారని.. భూములు కోల్పోతున్న ప్రజలకు న్యాయం చేయాలన్నారు. స్వేచ్ఛగా జీవించే హక్కు అంబేద్కర్ కల్పించారని.. లగచర్ల గ్రామంలో కమిషన్ త్వరలో పర్యటిస్తుందని.. కమిషన్ ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటుందని.. అన్యాయం జరిగితే కమిషన్ అసలు ఊరుకోదన్నారు. అధికారులపై జరిగిన దాడులు కమిషన్ ఖండిస్తుందన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, అనిల్ జాదవ్, నాయకులు, జాన్సన్ నాయక్, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. హైదరాబాద్ నుంచి షార్జా వెళుతున్న విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఫ్లైట్‌లోకి వెళ్లాక బాంబు ఉందంటూ ఓ ప్రయాణికుడు కేకలు వేశాడు. అతడిని అదుపులోకి తీసుకుని విమానాశ్రయ సిబ్బంది తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com